54918

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఫిబ్రవరి 3, 2008

ENTERED

కథా నిలయం
శ్రీకాకుళం

అద్భుత గాయని పి.సుశీల

హ్యాపీ బర్త్‌డే

2008 ఫిబ్రవరి-3నుంచి ఫిబ్రవరి-9వరకు

వి. ప్రత్యూష
10సం॥, ఫిబ్రవరి-6
సునీత-వెంకటరామారావు
అశోక్‌నగర్-ఖమ్మం



పి. ప్రత్యూష్
6సం॥, ఫిబ్రవరి-2002
సరస్వతి-జమలయ్య
జవహర్‌నగర్-హైదరాబాద్

ఎం. సుభాష్
జనవరి-8
సునీత-వెంకన్న
గుండ్లకుంట-మ॥నగర్

పి. శివాని
7సం॥, ఫిబ్రవరి-2001
కళావతి-రామకృష్ణ
బుర్హాన్‌పురం-ఖమ్మం

ఎస్. జెతిన్‌రెడ్డి
5సం॥, ఫిబ్రవరి-2003
ఉమ-సురేందర్‌రెడ్డి
బైపాస్‌రోడ్డు-ఖమ్మం

ఎ. రామానంద్
కవిత-బాబూరావు
ఎ.ఎస్. రావునగర్-హైదరాబాద్



ఎ. పుష్పక్
రజని-రవికుమార్
ముతాపురం-ఖమ్మం

జి. నాగరాజు
మంజుల-శ్రీహరి
గుర్రాలపల్లి-మెదక్

ఎం.వి. స్పందన
స్వర్ణ-రమణ
హన్మకొండ-వరంగల్

కథా నిలయం
శ్రీకాకుళం
ENTERED



నిరంతర అధ్యయనం అవశ్యం

మన అతిథి

పేరు	: మునిపల్లె రాజు
తల్లిదండ్రులు	: శారదాంబ, హనుమంతరావు
పుట్టిన ఊరు	: గుంటూరు (జిల్లా), బాపట్ల (తాలూకా), మునిపల్లె (గ్రామం)
పుట్టిన తేది	: 16 మార్చి, 1925
చదువు	: ఎఫ్.ఎ. (నేటి ఇంటర్‌తో సమానం)
ఉద్యోగం	: మిలట్రీ ఇంజనీరింగ్ సర్వీస్ డిఫెన్స్ మినిస్ట్రీలో (1943-1983) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గ్రేడ్-1
ప్రవృత్తి	: చదువు- అధ్యయనం-రచనలు చేయడం
రచనలు	: 4 కథా సంపుటాలు-మునిపల్లె రాజు కథలు, పుష్పాలు- ప్రేమికులు- పశువులు, దివోస్వప్నాలతో ముఖాముఖి, అస్తిత్వ నదం ఆవలి తీరాన (మ్యాజికల్ రియలిజం కథలు) కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన పుస్తకం.
నవల	: పూజారి (బిఎన్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన పూజాఫలం సినిమా కథ)
కవితా సంపుటాలు	: (1) వేరొక ఆకాశం- వేరెన్నో నక్షత్రాలు (తెలుగు, ఆంగ్ల భాషల్లో), అలసిపోయినవాడే అరణ్యకారుడు (ద్విభాషల్లో)
సాహితీ విమర్శ	: జర్నలిజంలో సృజనరాగాలు
గుర్తింపులు	: (1) కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - 2006 (అస్తిత్వ నదం ఆవలి తీరాన), (2) తెలుగు విశ్వ విద్యాలయం అవార్డులు (1985, 2005లో కథలకు), (3) రావిశాస్త్రి మెమోరియల్ అవార్డు (1993), జ్యేష్ట లిటరరీ అవార్డు- 1993, గోపీచంద్ అవార్డు, పులికంటి కృష్ణా రెడ్డి సాహిత్య అవార్డు, సహృదయ సాహితీ అవార్డు.
ఇష్టపడేది	: డాంబికం లేని నిజాయితీపరులు, జ్ఞాన సంపన్నులైన వృద్ధులు, విజ్ఞాన పథంలో నడుస్తున్న యువకులు
ఇష్టపడనిది	: డాంబికాన్ని ప్రదర్శించడం
లక్ష్యం	: మానవుడు ఎదుర్కొనే భౌతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, కల్లోలాలను విశ్లేషించడం, సానుభూతి చూపించడం నా రచనల లక్ష్యం. జీవితంలో మరికొంత సాహితీ పరామర్శ చేయాలని ఉంది.

అనాదిగా వస్తున్న సాంప్రదాయక విలువలు, జ్ఞానవాహిని, సంస్కృతిని విస్మరించినపుడు వ్యక్తిగానీ సమాజంగానీ పతనం అంచుకు జారినట్లే. అనాదిగా వస్తున్న కొన్ని మూఢనమ్మకాల్ని సంస్కరించుకోకపోవడం వల్ల కూడా చెడు ఎక్కువగా జరుగుతుంది. మనకు సరిపడని పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుసరించడం వల్ల సమాజంలో సంఘర్షణ చోటు చేసుకొంటుంది. క్యాపిటలిజం, ఫ్యూడలిజం చెట్టపట్టాలు వేసుకొనే పరిస్థితి మన దేశంలో వుంది. ఎంతో ప్రాచీన సంప్రదాయం ఉన్నా ఆటవిక సంప్రదాయాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ కారణాల వల్లనే తాత్విక దారిద్ర్యం వస్తోంది. నిరంతర అధ్యయనం వల్లనే ఔత్సాహిక రచయితలు సాహితీరంగంలో రాణిస్తారు. తరచుగా గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు పెంపొందించుకోవాలి. అన్ని నినాదాలు సమాజ శ్రేయస్సుకు తోడ్పడేవి కాదని, కొన్ని మాత్రమే మంచివని ఔత్సాహిక రచయితలు తమ వివేచనతో తెలుసుకోవాలి. సానుకూల ఆలోచనా విధానంతోనే ప్రగతి సాధ్యమవుతుంది.

మునిపల్లె రాజు

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
సీరియల్	...	8
సినిమా కబుర్లు	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
లాహిరి లాహిరిలో	...	20

ఇంకా...

మంచిపుస్తకం ...6

విశ్వ విప్లవకారుని
యువ ప్రస్థానం



విజ్ఞాన వీచిక... 4

సృష్టి- ప్రతి సృష్టి

సలహాలు	...	22
మనసా... తెలుసా...	...	23
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18

దాహం



విశ్లేషణాత్మకంగా సాగిన కవర్

జనవరి 20వ తేదీ సంచికలో కోటేశ్వరరావుగారి అట్ట మీది కథ "వందేళ్ళు-వంద డాలర్లు" విశ్లేషణాత్మకంగా సాగింది. 'ఆరోగ్యం' లో డాక్టర్ రత్నాకర్ గారి వివరణవల్ల బయాప్సీ గురించిన అవగాహన కలిగింది. మాత్‌లు కూడా, సీతాకోక చిలుకలకు దీటుగా... అందచందాలను ప్రదర్శించడం నయనానందకరంగా ఉంది. 'విజ్ఞాన వీచిక'లో బ్యాక్టీరియా కథాకమామీషు, బ్యాక్టీరియా ప్రాధాన్యత ఏపాటితో అవగతమయింది. "సినిమా కబుర్లు" ద్వారా, ప్రజాకవి అందెశ్రీ కలంకున్న శక్తి ఏంటో తెలిసింది. 'నవ్వుల్ పువ్వుల్' పర్వాలేదనిపించే స్థాయిలో అలరిస్తే, చలపాక ప్రకాష్ గారి కార్టూన్లు మాత్రం చప్పగా ఉన్నాయి. వీరు కార్టూన్లు గీయటంలో ఇంకా బాగా తర్ఫీదు పొందాల్సి ఉంది. అపుడే పాఠకులను ఆకట్టుకోగలరు. విలువల్ని పెంచే సాహిత్యం, సినిమాలు రావాలని కాంక్షిస్తున్న ఈ వారం అతిథి 'అక్కినేని కుటుంబరావు' గారి మాటతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాం. వీరి లాంటివారే బాలల సినిమాలను బతికించే రథసారథులు కావాలని మా అభిలాష.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం టౌన్.

పిల్లల శీర్షికలు బాగుంటున్నాయి

20వ తేదీన స్నేహ సంచికలో ప్రచురితమైన ముక్తవరపు పార్థ సారథి గారి అమెరికన్ డేగ 36వ భాగం సీరియల్ ఆసక్తి కరంగా సాగింది. ఓ మంచి సీరియల్‌ను పాఠకులకు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు. ముఖ్యంగా పిల్లలకోసం ఇస్తున్న హ్యాపీబర్త్‌డే, కలం స్నేహం శీర్షికలు బాగుంటున్నాయి. ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహకు అభినందనలు.

అనుపోజు,
రాజీవ్‌నగర్ కాలనీ.

కంటతడి పెట్టించిన 'చేదు ఫలం'

'చేదు ఫలం' కథ చాలా బాగుంది. యాప్పుల్లల ముక్కునే ముసలమ్మలు చాలా మంది వితంతు పెన్షన్లు లేక అనాథలు అయిపోయి, రోడ్లపైన వీధుల మీద ఎండల్లో, ఆకలి చావుల్తో బాధపడుతున్నారు. ఈ దేశంలో రామారావు, నాగన్న లాంటి వాళ్ళు ఉన్నంతకాలం పేదవాని గుండె చప్పుడు ఎవరికీ వినిపించదు. అందుకు జనం మారాలి. బక్కమ్మలాంటి ముసలమ్మలకు న్యాయం చెయ్యాలి. ఈ కథ మమ్మల్ని కంటతడి పెట్టించింది. కథ అందించిన జీవన్ గార్కి అభినందనలు.

ఎ. సత్యనారాయణ,
విజయనగరం.

సినిమా కబుర్లు ఇస్తున్నందుకు అభినందనలు

అందరికీ ...హ్యాపీ సంక్రాంతి అందించిన అట్టమీది కథ 'పల్లె జీవుల పల్లవి సంక్రాంతి' చాలా బాగుంది. లాహిరి.. లాహిరి... నవ్వుల్ పువ్వుల్, తమాషా తరువులు అందించినందుకు ఎంతో ఆనందంగా వుంది. పలువురు సినీ ప్రముఖుల మనోగతాలను ఇస్తున్నందుకు ప్రజాశక్తికి అభినందనలు.

కలికొండ ప్రభాకర్,
చేర్యాల, నల్గొండ.

చమురు కథ ఎన్నో విషయాలు తెల్పింది

ఈవారం అట్టమీది కథ చదివాం. చాలా విషయాలు తెలుసుకున్నాం. అసలు చమురు ధర ఎందుకు పెరుగుతోందో కూడా అర్థమైంది. సామాన్యుడు మొదలుకొని ధనవంతుడు వరకు ఉపయోగించే చమురు ధరల పెరుగుదల గురించి, దాని చరిత్ర గురించి ఇచ్చినందుకు చాలా సంతోషం. రంగుబొమ్మల్లో తమాషా తరువుల గురించి ఇచ్చి పాఠకులను బాగా ఆకట్టుకున్నారు. ఇలాంటి చిత్ర విచిత్రాలు మరిన్ని అందిస్తారని ఆశిస్తున్నాం.

వి. ఉమ, సికింద్రాబాద్.

'రుచి' సూపర్

'చేదు ఫలం' కథ చదివినంతసేపూ నాకు ఏడుపు ఆగలేదు. బక్కమ్మ పేదరికాన్ని రచయిత వర్ణించినప్పుడల్లా ఎంతో బాధగా అనిపించింది. నిజ జీవితంలో అలాంటివారు ఎదురైతే తప్పకుండా సాయం చేయాలని పించింది. కానీ మనం ఎందరికని సాయం చేస్తాం. ప్రభుత్వాలే



పూనుకొని ఏమైనా చేయాలి. వాటికే పట్టన ప్పుడు ఇలాంటి వారి బతుకులు ఎప్పటికి బాగుపడతాయి? రుచి వంటకాలు బావుంటున్నాయి. అలాగే మహిళల కోసం ఇంకా ఏమైనా కుట్లు అల్లికలు ఇస్తే బాగుంటుందికదా.

టి.సునీత, వరంగల్.

విజ్ఞానాన్ని పంచుతున్న వీచిక

అభివృద్ధి- అంధత్వం వ్యాసం చదివాం. ఎంతో నచ్చింది. అసలు అభివృద్ధి ఫలాలు ఎవరికి అందుతున్నాయి? ఎంతమంది పేదలు అంధత్వానికి బలవుతున్నారు. అణుబాంబుల తయారీకి పెడుతున్న ఖర్చును అంధత్వ నివారణకు ఉపయోగిస్తే... ఎన్నో వేలకోట్ల మంది అంధత్వానికి దూరమవుతారని చెప్పారు వెంకట్రావుగారు. ప్రభుత్వం డబ్బు ఎవరి కోసం ఖర్చుచేస్తున్నదనే విషయం దీన్నిబట్టే అర్థమౌతోంది. ఇంతమంచి వ్యాసాన్ని అందించిన రచయితకు మా ధన్యవాదాలు.

వసుంధర, పద్మ,
అద్దంకి, ప్రకాశం.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

ఆరోగ్యం

పన్ను పీకడం ఈజీ కాదు..!

శ్రీకాకుళం

డాక్టర్ టి.శంకర్,
దంత వైద్య నిపుణులు,
హైదరాబాద్.
ఫోన్ : 9441333906



దంత వైద్య చరిత్రలో పన్ను తీయడం ముఖ్యమైన చికిత్స. అయితే పన్ను తీయడమనేది అనుకున్నంత సులభమైన పని కాదు. కదిలే పళ్లను తీయడం ఒక ఎత్తయితే, అవసర పరిస్థితిలో ఆరోగ్యకరమైన పళ్లను తీయడం, పిప్పి పళ్లను తీయడం మరో ఎత్తు. దవడ ఎముకలో మిగిలిపోయిన పన్ను భాగాలను తీయడం అతి క్లిష్టమైన పని.

అయితే ఏ పన్ను తీయడానికైనా సాంకేతిక నైపుణ్యం, వైద్య విజ్ఞాన పరిజ్ఞానం, పరికరాల మంచి చెడ్డలమీద ఆధారపడి ఉంటుంది. అయితే కదిలే పళ్ల విషయం తప్పిస్తే మిగతా ఏ రకమైన పన్ను పీకడానికైనా ఎక్స్‌రే, మూత్ర పరీక్ష, రక్త పరీక్ష అవసరమవుతాయి. ఇది అనవసరమైన ఖర్చుగా భావిస్తే శస్త్ర చికిత్సలోను, ఆ తర్వాత జరగకూడని సంఘటనలేమైనా జరిగితే దంత వైద్యుణ్ణి ఇరకాటంలో పెట్టడమే కాకుండా, రోగి కూడా అనేక బాధలకు గురికావాల్సి వస్తుంది. ఈ విషయంలో దంతవైద్యులు చెప్పిన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

పన్ను తీయడానికి ఒక్కో పన్నుకు ఒక్కో పరికరం, ఒక్కో విధానం ఉంటుంది. పన్ను తీయాలంటే ముందు ఆ ప్రాంతంలో మత్తు మందు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం నోట్లోనే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. నోట్లో ఇంజక్షన్ చేయించుకోవడానికి చాలా మంది భయపడతారు. ఇందులో కూడా రకరకాల పద్ధతులుంటాయి. కింది దవడలోని విసురు దంతాలు గాని, చిన్న విసురుడు దంతాలు గాని పీకాల్సి వచ్చినప్పుడు చివరి విసురుడు దంతానికి కొద్దిగా పైన, బుగ్గవైపు ఇంజక్షన్ ఇస్తారు. మళ్లీ ప్రాంతీయంగా తీయాల్సిన పన్ను దగ్గర కూడా ఇంజక్షన్ ఇస్తారు. పుర్రె నుండి దవడలోనికి ప్రవేశించే ప్రధాన నరం చుట్టూ ఇంజక్షన్ ద్వారా మత్తు మందు పంపిస్తారు. దీంతో ఆ మందు ప్రభావం వున్నంత మేరకు ఆ నరం తన శక్తిని కోల్పోతుంది. దీన్నే మనం 'తిమ్మిరి' లేక 'మొద్దుబారడం' అంటాం.

ఈ తిమ్మిరి సుమారుగా 30 నుంచి 45 నిమిషాల వరకు ఉండొచ్చు. ఈ మధ్యలో పన్నును నొప్పి లేకుండా తీసేస్తారు.

ముందు పళ్ల విషయంలోను, పై పళ్ల విషయంలోను పీకాల్సిన పన్ను వున్న ప్రాంతంలోనే, ప్రాంతీయంగా ఇంజక్షన్ ఇస్తే సరిపోతుంది. సాధారణంగా కింది దవడలోని మూడవ విసురుడు దంతం తీయడం క్లిష్టంగా ఉంటుంది. అలాంటి వాటిని కొన్ని సందర్భాల్లో ఎముకను చిట్లించి తీయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఇలాంటివన్నీ ప్రత్యేకమైన ఆపరేషన్ థియేటర్‌లో చేస్తారు. ఇందుకు సహకరించని పిల్లల విషయంలో శరీరం మొత్తానికి మత్తు ఇంజక్షన్ ఇస్తారు.

కొన్ని సందర్భాల్లో పంటి ఎముక నిర్మాణంలో లోపాలుంటాయి. దీంతో అవి విరిగిపోవచ్చు. విరిగిన వాటిని అప్పటికప్పుడు తీయించేసుకోవడం అన్ని రకాలా మంచిది. పన్ను పూర్తిగా వచ్చిందా? లేదా? అని ప్రశ్నించే హక్కు రోగికి ఉంది. తీసిన ముక్కలు చూపించమనడంలో కూడా తప్పు లేదు. అలాగే కొన్ని పళ్ల మూలాలు వంపులు తిరిగి ఉంటాయి. దీంతో నైపుణ్యం ఉన్న వైద్యుడి చేతిలోనైనా పన్ను విరిగిపోవడమో, ఎముక విరిగిపోవడమో జరుగుతుంది. ఇలా జరిగినప్పుడు వైద్యునిపై ఆగ్రహం వ్యక్తం చేయడం న్యాయమైన పద్ధతి కాదు. కారణాన్ని తెలుసుకుని అందులోని మంచి చెడ్డలను అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది.

కొన్ని జాగ్రత్తలు

పంటి కిరీటం పైకి కన్పించినప్పటికీ, మూడొంతుల మూల భాగం దవడ ఎముకతో మునిగి ఉంటుంది. అయితే పన్ను తీసినప్పుడు ఆ ప్రాంతం దవడలో తొర్ర లేక కుదురు (సాకెట్) ఏర్పడుతుంది. దీంతో పంటికి సరఫరా చేసే రక్తనాళాలు చితికిపోవడం వల్ల రక్తస్రావం జరుగుతుంది.

పన్ను తీయించుకున్న వెంటనే దూది వుండను సాకెట్‌లో ఉంచి గట్టిగా నొక్కి పట్టాలి. మాటి మాటికి వుమ్మివేయకూడదు. దూదిని కనీసం పది నిమిషాల సేపు గట్టిగా వత్తిపట్టి ఉంచాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడికి రక్తనాళాలు మూసుకుని, రక్తస్రావం ఆగిపోతుంది. పన్ను తీయించుకున్న రోజు ఘనపదార్థాలు తీసుకోకూడదు. చల్లని పానీయాలు మంచివి. వేడి పదార్థాలతో పన్ను తీయించుకున్న చోట కాపు పెట్టకూడదు. పన్ను తీయించుకున్న వెంటనే వాహనాలను నడపకూడదు. అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడాన్ని 'సింకపి' అంటారు. దీని గురించి మరోసారి తెలుసుకుందాం.

పన్ను తీసేందుకు మత్తు ఇంజక్షన్ ఇచ్చినప్పుడు పెదవులు కూడా మొద్దుబారతాయి. గీరుకున్నా తెలియని పరిస్థితి. ఆ మత్తు పోయిన తర్వాత ఆ పుండ్ల బాధలు మొదలవుతాయి. ఎక్కువగా ఇది చిన్న పిల్లల్లో జరుగుతుంది. అతి సామాన్యమైన వ్యాధి నిరోధక మందులను, బాధానివారణ మందులను వాడడం ద్వారా పుండు, నొప్పి కూడా తగ్గిపోతాయి.

నోట్లో గాలిబుడగలు

కొంత మందికి నోట్లో ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే పెద్ద గాలిబుడగ కనిపిస్తుంది. దీన్ని 'సర్జికల్ ఎండయిసిమా' అంటారు. ఇంజక్షన్ సిరంజిలోని గాలిని పూర్తిగా తీయకుండా ఇంజక్షన్ ఇవ్వడం వల్ల జరిగే అనర్థం ఇది. అయితే చేతి వేలితో కాసేపు నొక్కిపట్టడం వల్లగాని, బుడగకు చిల్లు పెట్టడం వల్లగాని దీన్ని తగ్గించొచ్చు.

గొంతులో నొప్పి కొంత మందికి పన్ను తీసే సమయంలో భయంతో, వైద్యునికి సహకరించకపోవడంతో, తీసిన పన్ను జారి గొంతులో పడే ప్రమాదముంది. అవసరమైతే గొంతుకు శస్త్ర చికిత్స చేసి, పన్నును తీయాల్సిరావచ్చు.

పన్ను తీసిన వెంటనే, వుండ చుట్టిన దూదిని పన్ను తీసిన తొర్రలో పెట్టి నొక్కిపట్టమని డాక్టర్లు చెబుతారు. ఇలా నొక్కిపెట్టకుంటే రక్తనాళాలు మూసుకోక రక్తస్రావం జరుగుతూనే ఉంటుంది. మరి కొంత మంది నోట్లో లాలాజలం విపరీతంగా వుండటం వల్ల దాంతోపాటుగా రక్తాన్ని కూడా ఉమ్మేతారు. దీంతో నోట్లో నుంచి రక్తం వచ్చినట్లు భావిస్తారు.

ఇకపోతే హీమోఫీలియా వంటి జన్యుపరమైన వ్యాధులను గుర్తించక పన్ను తీసినప్పుడు బొట్టు బొట్టుగా రక్తం స్రవిస్తుంటుంది. పది నిమిషాల్లో రక్తస్రావం ఆగకుంటే వెంటనే దంత వైద్యుణ్ణి సంప్రదించడం అవసరం. రోగి ఆరోగ్య చరిత్రను అడగకుండా శస్త్ర చికిత్స చేస్తే ... అందులో 25 శాతం తప్పు డాక్టర్‌దే. కానీ తన ఆరోగ్య చరిత్రను ముందుగా చెప్పకుంటే రోగి 75 శాతం తప్పు చేసినట్లు.

సృష్టి-ప్రతి సృష్టి

ఎస్. వెంకట్రావు



కృత్రిమ క్రోమోజోమును తయారుచేసిన అమెరికా శాస్త్రవేత్తలు సృష్టి రహస్యాలను ఎక్కడినుండో కొట్టేయలేదు. ప్రకృతిలోని సృష్టి సూత్రాలను ఒక్కొక్కటిగా కనుగొనే క్రమంలోనే వారు క్రోమోజోము తయారుచేయగలిగారు. నిజానికి మానవుడు చేసిన ఆవిష్కరణలన్నీ కూడా ప్రకృతి సూత్రాలను కనిపెట్టడం ద్వారా మాత్రమే జరిగాయి. అంటే ప్రకృతి ఏ సూత్రాల ఆధారంగా అయితే పరిణామం చెందిందో, ఏ పరిణామం ద్వారా అయితే మనిషి ఆవిర్భవించాడో ఆ సూత్రాలనే నేడు మానవుడు తెలుసుకుని ప్రతిసృష్టి చేయగలుగుతున్నాడు. అంటే సృష్టే తన సూత్రాలు తాను తెలుసుకుని వాటి ఆధారంగా ప్రతిసృష్టి చేసుకుంటోందన్న మాట. ఇది నిజంగా ఆశ్చర్యం గొలిపే అంశమే. మనిషికి ఆలోచనాజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల ఇదంతా జరుగుతోంది. ఈ ఆలోచనా జ్ఞానం ప్రకృతి పరిణామం వల్ల అభివృద్ధి చెందిందే.

సృష్టిలో భాగమైన మనిషి ప్రతి సృష్టి చేయగలడా? మనిషి మేధస్సు అతన్ని సృష్టికర్తగా మార్చబోతోందా? అనేక సందర్భాల్లో ముందుకొచ్చిన ఈ ప్రశ్నలు నేడు శాస్త్ర ప్రపంచంలో మరోసారి చర్చనీయాంశాలైనాయి. అమెరికాలోని జె.సి.వి.ఐ (జె. క్రైగ్ వెంటర్ ఇన్‌స్టిట్యూట్)కు చెందిన 17 మంది శాస్త్రవేత్తల బృందం ఇటీవల తొలిసారిగా ఒక బ్యాక్టీరియాకు చెందిన క్రోమోజోము మొత్తాన్ని కృత్రిమంగా పరిశోధనాశాలలో ఉత్పత్తి చేయడం ఈ చర్చకు కారణం.

కాలిఫోర్నియాకు చెందిన వెంటర్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాల పరిశోధన తరువాత అతిపెద్ద మానవ నిర్మిత డిఎన్ఎ గొలుసును తయారు చేశారు. డిఎన్ఎ (డి-ఆక్సిరైబో న్యూక్లియార్ యాసిడ్) అనేది మానవ కణంలోని జన్యు పదార్థం. డిఎన్ఎ యొక్క సంపూర్ణమైన గొలుసునే క్రోమోజోము అంటారు. ఒక్కో జీవిలో ఒక్కో సంఖ్యలో క్రోమోజోములుంటాయి. ఉదాహరణకు మానవునిలో 23 జతల క్రోమోజోములుంటాయి. 22 జతలు మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన క్రోమోజోములుకాగా ఒక జత లైంగిక నిర్మాణాన్ని నిర్ణయించే క్రోమోజోములు. క్రోమోజోములు అంటే డిఎన్ఎ గొలుసు మినహా మరేమీ కాదని చెప్పుకున్నాం కదా. డిఎన్ఎ అనేది ఒకే గొలుసుకట్టు అణువు (మాలిక్యూల్). డిఎన్ఎ నిర్మాణంలోని వైవిధ్యమే జీవుల నిర్మాణంలోని వైవిధ్యాన్ని నిర్ణయిస్తుంది. అంటే బ్యాక్టీరియా కణంలోని డిఎన్ఎను బట్టి బ్యాక్టీరియా కణాలూ, కోడి కణాల్లోని డిఎన్ఎను బట్టి కోడి, మనిషి కణాల్లోని డిఎన్ఎను బట్టి మనిషి సృష్టించబడతాడు. ప్రతి డిఎన్ఎ అణు గొలుసులో అనేక వేల జన్యువులు ఉంటాయి. జీవుల లక్షణాలు నిర్ధారించేవి ఈ జన్యువులే. డిఎన్ఎ అణువు గుండ్రని మెట్ల (స్పైరల్ స్టెయిర్‌కేస్)ను పోలి ఉంటుంది. న్యూక్లియోటైడ్స్ అనే మెట్లతో ఇది నిర్మితమై ఉంటుంది. ఎడినైన్ (ఎ), థయామైన్ (టి), సైటోసిన్ (సి), గ్వానైన్ (జి) అనే నాలుగు రకాల క్షార అణువులూ, పంచదార అణువులూ, హైడ్రోజన్ పరమాణువుల అమరికతో న్యూక్లియోటైడ్‌లు ఏర్పడతాయి. ఈ న్యూక్లియోటైడ్‌లు ఫాస్ఫేట్ అణువులతో అనుసంధించబడి డిఎన్ఎ గొలుసు ఏర్పడుతుంది.

వెంటర్ సంస్థ శాస్త్రవేత్తలు తొలుత న్యూక్లియోటైడ్ అణువులను కృత్రిమంగా తయారుచేశారు. వీటిని మైకో ప్లాస్మా జెనిటేలియమ్ అనే బ్యాక్టీరియాలోని క్రోమోజోము నమూనాలో ఒకదాని కొకటి అనుసంధించడం ద్వారా ఒక సంపూర్ణమైన క్రోమోజోమును తయారు చేయగలిగారు. ఇలా అనుసంధించడానికి వీరు హోమోలోగస్ రికాంబినేషన్ అనే పద్ధతిని ఉపయోగించారు. కణాలు తమ క్రోమోజోములు దెబ్బతింటే మరమ్మత్తు చేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తాయి. అంటే క్రోమోజోములో ఎక్కడైనా డిఎన్ఎ భాగం దెబ్బతింటే తన చుట్టూ ఉన్న ద్రావకంలోనుండి తనకు కావలసిన అణువులను స్వీకరించి దెబ్బతిన్న భాగాన్ని పరిపూర్తి చేసుకుంటాయి. ఇదే పద్ధతిని ఉపయోగించి కృత్రిమ డిఎన్ఎను తయారుచేసినట్లు 'సైన్సు' అనే పత్రికలో శాస్త్రవేత్త డాన్ గిబ్సన్ రాశారు. గతంలో కూడా డిఎన్ఎ అణువులను నిర్మించినప్పటికీ ఒక బ్యాక్టీరియాకు చెందిన క్రోమోజోములోని మొత్తం డిఎన్ఎ గొలుసును నిర్మంచడం ఇదే ప్రథమం. 5,82, 972 న్యూక్లియోటైడ్‌లతో వీరు ఈ కృత్రిమ క్రోమోజోమును నిర్మించారు.

క్రోమోజోము నిర్మాణం అనేది కృత్రిమ జీవసృష్టి (ప్రతి సృష్టి)కి సంబంధించిన మూడు కీలక ఘట్టాల్లో రెండోది. మొదటిది జన్యు నిర్మాణం. అది 1950 వ దశకంలోనే సాధించారు. ఇప్పుడు వెంటర్ సంస్థ శాస్త్రవేత్తలు రెండో ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. ఇక ఈ క్రోమోజోమును బ్యాక్టీరియా కణంలో ప్రవేశపెడితే కృత్రిమ జీవిని ఉత్పత్తి చేసినట్లే. దీనిపైన పెద్ద ఎత్తున పరిశోధనలు సాగుతున్నాయి. బయో ఇంజనీరింగులో ఇప్పుడు జరుగుతున్న పరిశోధనల అభివృద్ధిని గమనిస్తే బహుశా మూడో ఘట్టం త్వరలోనే పూర్తి కావచ్చు. అప్పుడు మనిషి

కృత్రిమ పద్ధతుల్లో సంపూర్ణమైన జీవిని సృష్టించినట్లే అవుతుంది.

ఇది ప్రస్తుతం పాత ప్రశ్ననే మరోసారి ముందుకు తెచ్చింది. మనిషి జీవులను సృష్టించగలడా? అలా అయితే మనిషిని కూడా కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా? ఈ ప్రశ్నకు సమాధానం మరో ప్రశ్నకు చెప్పుకునే సమాధానంలో అంతర్భాగంగా ఉంటుంది. అదేమంటే, అసలు సృష్టి ఎలా జరుగుతోంది? దేవుడు, లేక సృష్టికి అతీతమైన శక్తి గోచరాగోచరమైన, చరాచరమైన విశ్వాన్నీ అందులోని ప్రకృతినీ, అందులో భాగంగా జీవులనూ, మానవుణ్ణీ సృష్టించి, నడిపిస్తోందని చెప్పేవారు కొందరు. అలా కాకుండా ఈ గోచరాగోచరమైన, చరాచరమైన విశ్వంలో సృష్టి అనేది కొన్ని సూత్రాల ఆధారంగా నడుస్తుందని చెప్పే వారు కొందరు. మొదటి వాదనలో సృష్టికర్త ఉంటాడు (లేక ఉంటుంది). రెండో వాదనలో సృష్టికర్త ఉండదు. సృష్టి కర్త లేకుండా సృష్టి ఎలా జరుగుతుంది? అన్న ప్రశ్నకు సమాధానం అమెరికా శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగంలో మనకు దొరుకుతుంది. ఇక్కడ కృత్రిమ క్రోమోజోమును తయారుచేసింది మనిషి. 'రేపు' పూర్తిస్థాయి జీవాన్ని కృత్రిమంగా తయారుచేస్తాడు కూడా. అంటే మనిషి సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నాడు. ఇది ఎలా జరిగింది?

తాత్వికంగా దీనికి సమాధానాలు చెప్పుకోవాలంటే రెండు జరగాలి. ఒకటి: సృష్టి రహస్యాన్ని సృష్టి కర్త నుండి (దేవుడు, లేక అతీత శక్తినుండి) తస్కరించి ఉండాలి. లేదా రెండు: సృష్టి కొన్ని సూత్రాల ప్రకారం జరుగుతుంటే మనిషి ఆ సూత్రాలను కనిపెట్టగలగాలి.

కృత్రిమ క్రోమోజోమును తయారుచేసిన అమెరికా శాస్త్రవేత్తలు సృష్టి రహస్యాలను ఎక్కడినుండో కొట్టేయలేదు. ప్రకృతిలోని సృష్టి సూత్రాలను ఒక్కొక్కటిగా కనుగొనే క్రమంలోనే వారు క్రోమోజోము తయారుచేయగలిగారు. నిజానికి మానవుడు చేసిన ఆవిష్కరణలన్నీ కూడా ప్రకృతి సూత్రాలను కనిపెట్టడం ద్వారా మాత్రమే జరిగాయి. అంటే ప్రకృతి ఏ సూత్రాల ఆధారంగా అయితే పరిణామం చెందిందో, ఏ పరిణామం ద్వారా అయితే మనిషి ఆవిర్భవించాడో ఆ సూత్రాలనే నేడు మానవుడు తెలుసుకుని ప్రతిసృష్టి చేయగలుగుతున్నాడు. అంటే సృష్టే తన సూత్రాలు తాను తెలుసుకుని వాటి ఆధారంగా ప్రతిసృష్టి చేసుకుంటోందన్న మాట. ఇది నిజంగా ఆశ్చర్యం గొలిపే అంశమే. మనిషికి ఆలోచనాజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల ఇదంతా జరుగుతోంది. ఈ ఆలోచనా జ్ఞానం ప్రకృతి పరిణామం వల్ల అభివృద్ధి చెందిందే.

చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం, అంతకుముందూ, తరువాతా అభివృద్ధి చెందిన విజ్ఞాన శాస్త్ర విభాగాలు అన్నీ కూడా ... సృష్టి కొన్ని సూత్రాల అధారంగా నడుస్తోందని చెబుతున్నాయి. అందువల్ల ప్రత్యేకమైన సృష్టికర్త ఎవరూ లేరు. కాని ఇప్పటికి కూడా ఎవరో సృష్టి కర్త ఉన్నారన్న భావాన్ని పట్టుకు వేలాడే వారు మామూలు ప్రజల్లోనే కాదు, శాస్త్రవేత్తల్లో కూడా చాలా మంది ఉన్నారు. డార్విన్ పరిణామవాదం, తదనంతర పరిశోధనలూ వారి వాదాన్ని పూర్వపక్షం చేసిన తరువాత ఇటీవలి కాలంలో అటువంటి వారు కొత్త "సిద్ధాంతాన్ని" ముందుకు తెచ్చి తమ వాదనను సమర్థిచుకుంటున్నారు. జెనిటిక్ ఇంజినీరింగ్‌కు తోడు ఎలక్ట్రానిక్ యుగం ప్రారంభమైన తరువాత ఈ వాదనలు కొత్త సూత్రీకరణలతో ముందుకు వచ్చాయి. అమెరికాలో ముందుకొచ్చిన "ఇంటెలిజెంట్ క్రియేషన్" (తెలివైన సృష్టి) వాదన ఇటువంటిదే. దేవుడో లేక ఎవరో ఒక గొప్ప జ్ఞాని జీవాన్ని ముందుగానే ప్రోగ్రామింగ్ చేసిపెట్టారనేది వీరి వాదన.

సరికొత్త కృత్రిమ డిఎన్ఎ ఉత్పత్తి ప్రక్రియ ఈ వాదనను పూర్వపక్షం చేస్తోంది. అమెరికా శాస్త్రవేత్తలు సృష్టి రహస్యాలను ఎవరి దగ్గర నుండి తస్కరించలేదు. ప్రకృతిలో ఉన్న సూత్రాలను ఆకళింపుచేసుకుని ఈ విజయం సాధించగలిగారు. ❄









కథా నిలయం
శ్రీకాకుళం

తెర

> "నదీ నదాలు, అడవులు, కొండలు ఎడారులా మనకడ్డంకి అన్నట్టు గతాన్ని గురించిన చింత, భవిష్యత్తును గురించిన ఆందోళన లేకుండా ముందు వెనక చూడకుండా తినీ తినకా సాహసమే వూపిరిగా సాగిన ఈ యాత్రను చే తర్వాత కథనం చేశారు. సంపన్నమైన ఉత్తర అమెరికా వైపు బయలుదేరిన ఈ యాత్ర దక్షిణం వైపు నడిచింది.అక్కడి పేదరికం, ప్రజల దుర్భర స్థితిగతులు చూస్తున్న కొద్ది ఆ మిత్ర ద్వయం దృక్పథంలోనే గొప్ప మార్పు వచ్చింది. అప్పటికి చే ప్రసిద్ధుడేమీ కాదు. అందరుయువకుల వంటి వాడే. అయితే ఆయనలో భవిష్యత్తు గురించిన ఒక వూహాచిత్రం వుంది. దాన్ని చెప్పగల శైలి కూడా వుంది. అందుకే తర్వాత వాటిని కథనం రూపంలో తిరిగి రాశాడు. వ్యక్తిగత జీవితం గురించి, సాంస్కృతిక నేపథ్యం గురించి అంతగా తెలియని విషయాలు వెల్లడించాడు.

విశ్వ విప్లవకారుని యువ ప్రస్థానం



ఇది విశ్వసించలేని సాహసగాథ కాదు. నిరాశావాది వినిపిస్తున్న కథనం అంతకంటే కాదు. దీన్ని అలా నడిపించాలన్నది నా ఉద్దేశం కాదని చెప్పదలచాను... దీన్ని రాసిన వ్యక్తి అర్జెంటీనాలో కాలూనిన మరుక్షణం తనను తాను మర్చిపోయాడు... ప్రపంచ ప్రసిద్ధుడైన ప్రథమ శ్రేణి విప్లవకారుడు ఎర్నెస్టో చే గువేరా మహత్తర యాత్రా కథనం 'మోటార్ సైకిల్ డైరీ' మొదటి అధ్యాయంలో మాటలివి. భావి విప్లవ జీవితానికి ఉద్దీపకం వంటి సాహసమూ సామాజిక సందర్శనమూ కలగలపిన ఇలాంటి రచన విప్లవోద్యమంలోనే అరుదైనదని చెప్పొచ్చు.

కమ్యూనిస్టుల గురించి చాలా మందికి అనేక దురభిప్రాయాలుంటాయి. ఉంటాయి అనేకంటే అలా ప్రచారం చేస్తారు అని చెప్పడం సమంజసం. వారు కరుడు కట్టి పోయివుంటారనీ, సిద్ధాంతాలు తప్ప మరేమీ పట్టవనీ, మానవత్వానికి తావుండదనీ ఏవేవో!వాస్తవాలు ఇందుకు పూర్తి విరుద్ధమైనవి. మానవత్వాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చి దాన్ని ఆచరణలో అమలుకు తెచ్చే పోరాట మార్గం చూపించడమే కమ్యూనిస్టుల విశిష్టత. అయినా సరే ఇలాంటి పాక్షిక విశ్లేషణలూ, అరకొర సూత్రీకరణలూ సాగిపోతూనే వుంటాయి. ఎవరో ఎందుకు? మహా తాత్వికుడుగా పేరొందిన గౌరవనీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారే నీవు యువకుడుగా వున్నప్పుడు కమ్యూనిస్టువు కాకపోతే నీ యవ్వనంలో లోపం. తర్వాత కూడా ఆ మార్గంలోనే వుంటే నీ బుద్ధిలో లోపం " అన్నట్టు ఆరెస్సెస్ రచయితలు నిరంతరం చెబుతుంటారు. అంటే యువకులు ఏదో ఆవేశంలో కమ్యూనిస్టులవుతారనీ, బుద్ధి వికసించిన తర్వాత మారిపోతారని వారి భాష్యం. తొంభయ్యవ పడిలో కూడా తలవంచిన వీరుల్లా మన కాలంలో ప్రకాశిస్తున్న జ్యోతిబాసు నుంచి ఫైడెల్ కాస్ట్రో వరకూ ఎందరో ఈ వాదనలోని వక్రత్వాన్ని పూర్వపక్షం చేసే ఉదాహరణలుగా వున్నారు.

సాటి మనుషుల గురించి ఆలోచించలేని వారు, ముఖ్యంగా సమాజంలో హెచ్చు తగ్గులు పోయి అందరూ సుఖ సంతోషాలతో విలసిల్లాలని కోరుకోని వారు కమ్యూనిస్టులు కాలేరన్నది నిజమే. అయితే అది ఒక్క క్షణంలో జరిగే జ్ఞానోదయం కాదు. అందరికీ ఒకేలా జరిగేది కాదు. అట్టడుగు ఆగాథాల్లోంచి జనం కమ్యూనిజంలోకి వస్తారు, నేను సమున్నత కవితా శిఖరాల్లోంచి కమ్యూనిజంలోకి దూకుతాను అని రష్యన్ కవి మయకోవస్కీ అంటాడు. ఎవరి జీవితానుభవాలు, ఆలోచనలూ వారిని మలుస్తాయి. మారుస్తాయి.

అర్జెంటీనాలోని రోసారియాలో 1928 జూన్ 14న జన్మించిన చే గువేరా వైద్య విద్యార్థిగా వున్నప్పుడు
అల్బెర్టో గ్రెనడో అనే మిత్రునితో కలసి ఒక అస్తవ్యస్తపు 'లా పొడేసారో2 ' మోటార్ సైకిల్‌పై లాటిన్ అమెరికా పర్యటన జరిపాడు. 1951 డిసెంబర్‌లో మొదలైన ఈ యాత్ర 1952 ఆగష్టులో ముగిసింది. చరిత్రలో ఎందరో తాత్వికులు, యాత్రీకులు ఇలా దేశ సంచారం చేయడం చూస్తాం గాని చే గువేరా యాత్రతో పోల్చదగినవి లేనేలేవు. ఈ యాత్రా క్రమంలో వ్యదార్థ జీవిత యదార్థ దృశ్యాలను గమనిస్తూ చే ఒక గొప్ప విప్లవకారుడుగా మారేందుకు సంసిద్ధుడయ్యాడు.

"నదీ నదాలు, అడవులు, కొండలు ఎడారులా మనకడ్డంకి అన్నట్టు గతాన్ని గురించిన చింత, భవిష్యత్తును గురించిన ఆందోళన లేకుండా ముందు వెనక చూడకుండా తినీ తినకా సాహసమే వూపిరిగా సాగిన ఈ యాత్రను చే తర్వాత కథనం చేశారు. సంపన్నమైన ఉత్తర అమెరికా వైపు బయలుదేరిన ఈ యాత్ర దక్షిణం వైపు నడిచింది. అక్కడి పేదరికం, ప్రజల దుర్భర స్థితిగతులు చూస్తున్న కొద్ది ఆ మిత్ర ద్వయం దృక్పథంలోనే గొప్ప మార్పు వచ్చింది. అప్పటికి, చే ప్రసిద్ధుడేమీ కాదు. అందరు యువకుల వంటి వాడే. అయితే ఆయనలో భవిష్యత్తు గురించిన ఒక వూహాచిత్రం వుంది. దాన్ని చెప్పగల శైలి కూడా వుంది. అందుకే తర్వాత వాటిని కథనం రూపంలో తిరిగి రాశాడు. వ్యక్తిగత జీవితం గురించి, సాంస్కృతిక నేపథ్యం గురించి అంతగా తెలియని విషయాలు వెల్లడించాడు.

చేను అసాధారణ విప్లవ ప్రతీకగా మార్చిన అంశాలలో ఆయన శైలి కూడా ఒకటి. దాని బీజాలు మనం మోటార్ సైకిల్ డైరీలో చూస్తాము. ఈ సాహస యాత్ర విశేషాలే కాదు. విశ్లేషణ శైలి కూడా మనను కట్టిపడేస్తుంది. ప్రజల జీవితాలు, ప్రకృతి సౌందర్యాలు, దిక్కుతోచని పరిస్థితులు. అగమ్యమైన రేపులు, అనుకోకుండా ముగిసిపోయిన నిన్నలు, అందమైన స్త్రీలు మనోహరమైన పురుషులు, ముద్దులు మూటగట్టే పిల్లలు, సాంకేతిక అద్భుతాలూ, సామాజిక అగాధాలు, ఆదరించిన సహృదయులూ, తరిమి కొట్టిన గృహస్తులూ, చిందులేసిన కుష్టురోగులూ, పరుగులు తీసిన జింకపిల్లలూ, వెంటవచ్చిన కుక్కపిల్లలూ ఒకటేమిటి- 70 ఎంఎం యవనికపై చే తాను చూసిన జీవితాన్ని మనకూ చూపించాడు. కమ్యూనిస్టులు ఎంతటి సహజసిద్ధంగా రూపొందుతారో ఎంతటి బాధావేదనలు అనుభవిస్తారో ఈ డైరీ మనకు తెలియజెబుతుంది.

ఈ యాత్ర చేసినప్పుడు చే వయసు కేవలం 21 ఏళ్లు మాత్రమేనని గుర్తు చేసుకుంటే ఆయన దృష్టి కోణం ఎంత విశాలమో తెలుస్తుంది.

"మొదటిసారి ఈ నోట్సు చదివినపుడు అవి పుస్తక రూపంలో కూడా లేవు. ఎవరు రాశారో కూడా తెలియదు. అప్పుడు నేను చాలా చిన్నదాన్ని. తన సాహసాలను అప్పటికప్పుడు ఈ విధంగా వర్ణించిన వారెవరో తెలుసుకోగలిగాను. ఆయన కూతురిని అయినందుకు చాలా సంతోషించాను... కొన్ని సందర్భాల్లో నేను గ్రెనడాను అయిపోయి నాన్నను అతుక్కుని ఆయన వెనక కూచున్నట్టు అనుభూతికి చెందాను. నేను కూడా ఆ లోయలు కొండలు సరస్సులు తిరిగిన అనుభూతి కలిగింది. ప్రత్యేకించి ఆయన తను చేసిన పనుల గురించి వర్ణిస్తున్నప్పుడు నన్ను నేను మర్చిపోయాను. ఎంత ఎక్కువగా చదివానో అంత ఎక్కువగా యువకుడుగా వున్నప్పటి మా నాన్న పట్ల ప్రేమ పెరిగింది. ఈ యువ సాహసి విషయ పరిజ్ఞానం" అని ఆయన కుమార్తె అలెదా గువేరా రాసిన మాటలు పాఠకులందరికీ వర్తిస్తాయి.

మళ్లీ మోటారు సైకిల్ డైరీలోకి వస్తే "నరాలు తెగే ఉత్కంఠలో ఉన్నప్పుడు ఒక్కసారిగా ఆ కుక్క మూలగటం మానేసింది. అక్కడే నిలబడి నేల మీద పొర్లటం మొదలు పెట్టింది. తలను రెండు కాళ్ల మధ్య పెట్టి గంతులు వేసింది' అంటూ వర్ణించడం ఆయనకే చెల్లుతుంది. మళ్లీ మళ్లీ తిరిగి వచ్చే ఆ కుక్క పిల్లకు 'కమ్ బ్యాక్' అని నామకరణం చేయడంలోనూ అదే చమత్కారం.

ఇందులో హాస్యం కూడా పుష్కలంగా జాలువారుతుంది. ఒక ఆసామి దొరికినప్పుడు రాత్రి పార్టీలో చాప్లిన్ తరహాలో వైన్ తాగి మత్తు తలకెక్కినట్టు నటిస్తూ సాధ్యమైనంత ఎక్కువ ఆహారం తీసుకోవడం దృశ్యంగా చదువరుల కళ్ల ముందు కదలాడుతుంది. ఒంటెల్లా తాము ఆహారం నిల్వ చేసుకోసాగామని చే రాస్తాడు! చిలీ గెరిల్లా దళాలలో చేరడం, విచిత్ర వ్యూహాలతో తప్పించుకోవడం, ఇవన్నీ గొప్ప చిత్రణా నైపుణ్యంతో తీర్చిదిద్దాడు. తిండి తిప్పలు లేక అనారోగ్యంతో తామే బాధల పాలైన సందర్భాలలోనూ చే అప్పటి పరిస్థితులను ఆకట్టుకునేలా రాస్తాడు. అన్నిటినీ మించి తమ సాహసయాత్రలో వాహనంతో అనుభవాలను కూడా అంతే ఆసక్తిగా వర్ణిస్తాడు. " నేను బ్రేకు వేశాను. కాని అప్పటికే నిర్వీర్యమై పోయిన సైనికుడిలా ఆ బ్రేకు పని చేయలేదు. కాని కొన్ని క్షణాల్లో నా కళ్లకు పశువుల మందలు లేపుతున్న దుమ్ము ధూళి తప్ప మరేమీ కనిపించలేదు.. ఈ మందలో ఆఖరి పశువు గిట్టల దెబ్బ మాత్రమే తప్పించుకోగలిగాము. అంతలోనే బండిని మళ్లించాను. మహా వేగంగా నీళ్లు ప్రవహిస్తున్నాయి....."

"ఈ బీదరాలి పరిస్థితి దుర్భరంగా వుంది. ఆమె గది నిండా దుమ్ముకొట్టుకున్న కాళ్లు చెల్లాచెదురుగా తిరిగినట్టు కనిపిస్తోంది. రెండు గోడ కుర్చీలు దుమ్ములోనే వున్నాయి. ఆ ఇంట్లో విలాస వస్తువులు అవే" అయితే ఈ విషాదం నిరాశతో ముగియడం మరింత పోరాడాలన్న చైతన్యం తనలో కలిగించిందని తర్వాత రాస్తాడు.

సహజంగానే అనువాద సమస్యలున్నా మోటారు సైకిల్ డైరీ చదవడం గొప్ప అనుభవం.

చేగువేరా
మోటార్ సైకిల్ డైరీ
వెల:75/-, పేజీలు:160
ప్రతులకు : ప్రజాశక్తి ముక్ హౌస్,
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్.









మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ

తన అనుచరులందర్నీ గుహ వెలుపల గుమిగూడమన్నాడు జాక్. ఉదయం ఆహ్లాదకరంగా ఉంది. లే ఎండ చురుక్కుమంటున్నది. రాత్రి కురిసిన మంచు ఎప్పుడో కరిగిపోయింది. "గాలిలో ఎగిరే మేఘాలలా కదలాలని ఉంది. బతుకంటే అందరికీ తీపే. ప్రేమశక్తి గొప్పది. ప్రాణాల్ని రక్షించుకోవటమే మనిషికుండే మొదటి కోరిక. ప్రాణం కోసమే పోరాడతాడు. ప్రాణం కోసమే చంపుతాడు. హత్యలు కూడా ప్రేమలో భాగమే. మృత్యువునెవరూ కోరుకోరు. కాని త్వరలోనే మృత్యుదేవత ఇక్కడ విహరించబోతున్నదని నాకు తెలుసు" అంటూ తాత్వికంగా వుద్బోధించాడు జాక్.

అమెరికన్ వేగ

(38వ భాగం)

యుద్ధమంటూ జరిగితే అందరూ చావాల్సిందే. స్త్రీలు, పిల్లలతో సహా ఇవి అనివార్యమే అయినా, కనీసం, సైనికులు కాల్పులను ప్రారంభించనీయండి. సమావేశాలు జరిగినంత కాలం యుద్ధముండదని మేము కమిషనర్లకు హామీ ఇచ్చాం. అది నిలబెట్టుకోవలసిన బాధ్యత వారి మీదుంది. "మాటకు ప్రాణమిచ్చే మనిషి కెప్టెన్ జాక్" అని లోకం గుర్తుంచుకోవాలి" అంటూ తన వాళ్లకు నచ్చజెప్పాడు. ఆ వెంటనే, తను కాంబీని చంపుతానని చేసిన ప్రతిజ్ఞ గుర్తుకొచ్చిందేమో, " ఆ విషయం ఇంకా తెగలాగకండి. ఏదో కోపంలో మాట్లాడాను. హుకర్ జిం, ఇలాంటి వాగ్దానాలు అమలు పరచకపోవటమే మంచిది" అన్నాడు.

"వీల్లేదు. కాంబీని చంపాల్సిందే. నీ వుపన్యాసం బాగానే ఉంది. కాని ఇది ఉపన్యాసాలకు సమయం కాదు" అన్నాడు హుకర్ జిం.

తన చుట్టూ కూర్చున్న యాభైమందిని పరికించి చూస్తూ, "కాంబీని చంపాలి' అనుకున్నవాళ్ళు లేచి నిలబడండి" అన్నాడు జాక్. ఎండ వేడి పెరిగింది. పన్నెండు మంది మాత్రమే కూర్చున్నారు.

"సరే మీ పంతమే నెగ్గనీయండి. కాని, సమావేశంలో, మొదట, కాంబీ మన ప్రతిపాదనలను అంగీకరిస్తాడేమో అడుగుతాను. అంగీకరిస్తానంటే చంపను. ఇష్టమేనా?" అని అడిగాడు జాక్.

"అలాగే"

"యస్"

అంటే, మాడాక్స్ 'ప్రతిపాదనలకు' జవాబు చెప్పటం మీద కాంబీ జీవితం ఆధారపడి వుందన్నమాట.

* * *

గుడ్ ఫ్రైడే, 1873

తెల్లవారు జామున చల్లటి గాలి వీస్తున్నది. టెంటుకు కట్టిన కాన్వాస్ గుడ్డ రెపరెపలాడుతున్నది. ఆర్మీ క్యాంప్‌కూ, లావా బెడ్స్‌కూ మధ్యనున్న సమావేశ స్థలంలో మాడాక్ నిరీక్షిస్తున్నారు. కెప్టెన్ జాక్, హుకర్ జిం, షాంచిన్ జాన్, ఎల్లెన్స్ మాన్, బ్లాక్‌జిం, షాక్ నాస్టీ జిం కాస్త ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. చలి కాచుకోవటానికి కొందరు సేజ్ బ్రష్ (దుబ్బు పొదలాంటి మొక్క)తో నెగళ్ళు వేశారు. కమిషనర్లు రావటమే తరువాయి. ఈ సారి మాడాక్స్ వెంట స్త్రీలూ, పిల్లలూ లేరు. ఎవరి వద్దా రైఫిళ్ళు కూడా లేవు గాని వెంట తెచ్చుకున్న పిస్టళ్లను దుస్తుల మాటున దాచుకున్నారు.

కమిషనర్లు ఆలస్యంగా చేరుకున్నారు (వెళ్లకూడదని వైనెమో వాళ్లను వారించింది). పదకొండు గంటల సమయంలో జనరల్ కాంబీ, రెవరెండ్ థామస్ కూడా నెమ్మదిగా నడిచి వచ్చారు. వాళ్ళ వెనక, ఎల్సెన్ డైయార్ ఆల్ఫ్రెడ్ మీచాం, వైనెమా, ఫ్రాంక్ ది డిక్ గుర్రాల మీద స్వారీ చేశారు. దుబాసీలు బాస్టన్ చార్లీ, బోగస్ చార్లీ మాడాక్స్‌తో సంప్రదింపుల కోసం టెంటులో కెళ్ళారు. వాళ్ల వద్ద రైఫిళ్లున్నాయి గాని అవి కేవలం లాంఛనం మాత్రమే. కమిషనర్ల వద్ద ఏ ఆయుధాలూ లేవు. కోటు జేబుల్లో డేరింగర్ (శక్తి వంతమైన పొట్టి పిస్తోలు) దాచుకున్నారు మీచాం, డైయార్.

కాంబీ, టెంటు చేరుకున్న వెంటనే, బహుమతిగా తెచ్చిన సిగార్లను అందరికీ పంచాడు. సేజ్ బ్రష్ కొమ్మలు అంటు పెట్టి అందరూ వాటిని వెలిగించారు (సాంప్రదాయకంగా వాళ్లు దీన్ని స్మోక్ ఆఫ్ పీస్ అంటారు).

తరువాత, రికార్డుల్లోకెక్కిన ఫ్రాంక్ రిడిల్ కథనం ప్రకారం కాంబీ తన ప్రారంభోపన్యాసంతో 'ముప్పైఏళ్ల నుండీ ఇండియన్ వ్యవహారాలు చూస్తున్నాను. మన మధ్య సుహృద్భావం ముఖ్యం. శాంతి నెలకొనాలి. చేసిన వాగ్దానాలు అమలు చేసి తీరతాను. రిజర్వేషన్‌కు వస్తే అక్కడ సుఖ జీవితానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాను. తెల్లవాళ్లలాగ మీరు స్వేచ్ఛగా బతకొచ్చు' అంటూ స్నేహ హస్తం అందించాడు.

తరువాత మాట్లాడిన మీచాం, "ఘర్షణలకు తక్షణం ఫుల్‌స్టాప్ పెట్టాలి. నెత్తుటి మరకలు తుడిచి రమ్మని తనను పంపించాడు గ్రేట్ ఫాదర్' అంటూ అందరి సహకారం అర్థించాడు. అనుమానాలతో బతకటం సాధ్యం కాదు. శాంతియుత వాతావరణం తప్పనిసరి. సదవగాహనతోనే బంగారు భవిష్యత్తు సాధ్యం. అందరికీ సరిపడా తిండి, దుస్తులు, ఇళ్లు, బ్లాంకెట్లు దొరుకుతాయి" అన్నాడు.

"మీరెన్ని చెప్పినా సరే? మేమీ ప్రాంతం విడిచి రిజర్వేషన్ కెళ్లం" అన్నాడు కెప్టెన్ జాన్. టూలె లేక్, లావా బెడ్ తమ జన్మభూమి. సైనిక బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

జాక్ 'మొండి' వాదనతో విసుగెత్తిన మీచాం," చిన్నపిల్లల్లా ఒకే మాట పదిసార్లు వల్లించటమెందుకు" అంటూ కసురుకున్నాడు. "రిజర్వేషన్‌లో జీవితం సుఖంగా ఉంటుంది. ఇన్ని కష్టాలు పడుతూ ఇంకా ఇక్కడే వుండదలచుకుంటే వుండండి మీ ఇష్టం".

సుమారు పది అడుగుల దూరంలో కూర్చున్న షాంచిన్ జాన్ కోపంగా, మీచాంను మాడాక్ భాషలో "షటప్" అంటూ తిట్టాడు. అదే అదనుగా గుర్రం మీదున్న మీచాం కోటు తీసి తొడుక్కొని "ఎలా వున్నాను? మీచాంలా కనిపిస్తున్నానా?" అంటూ ఎగతాళిగా నవ్వాడు

హుకర్‌జిం. వచ్చీరాని అతని ఇంగ్లీషుకు అందరూ విరగబడి నవ్వారు.

ఇది అవమానమే. కాస్త తమాయించుకొని, తన హ్యాట్‌కూడా తీసిచ్చి "ఇది పెట్టుకో, అప్పుడు సరిగ్గా నా లాగే ఉంటావు" అన్నాడు మీచాం, హుకర్ జిమ్‌తో.

"అలాగే, నువ్వివ్వక్కర్లేదు. మరి కాసేపట్లో అది నాదే అవుతుంది" అంటూ ఛీత్కారంగా చూశాడు హుకర్ జిం.

కాంచీకి పరిస్థితి అర్థమైంది. హుకర్‌జిం అన్నింటికీ తెగించాడు. అతణ్ణి శాంతపరిచే వుద్దేశ్యంతో "వాషింగ్టన్‌లోని గ్రేట్ ఫాదర్ ఆదేశిస్తే తప్ప సైనికులు వెనక్కు వెళ్లరు. మనం తొందర పడకూడదు" అంటూ జాక్ వైపు చూశాడు. వాతావరణం వేడెక్కింది.

"కాంచీ, మీరు కూడా నా మాటలు జాగ్రత్తగా వినండి. సైనికులున్నంత వరకూ ఇంక శాంతి నెలకొనదు. ఏవేవో వాగ్దానాలు చేశారు గదా, అవెప్పుడు అమలు జరిగేను? మీకు చాతయితే, భోజనం, దుస్తులు, బ్లాంకెట్లు ఇప్పుడే మాకు పంపించండి. లేదా, మీవన్నీ వట్టి మాటలన్నట్టే. టైం లేదు కాంచీ, ఏదో ఒకటి తేల్చండి. మా కోర్కెలు తీర్చుతారా లేదా? మీ జవాబు కావాలి. క్విక్" అంటూ వుద్రేకంతో వూగిపోయాడు జాక్.

ఇన్ని సంవత్సరాల చర్చలలో ఇంత వుద్రిక్తస్థితి ఎప్పుడూ లేదు. ఇక ఎవరూ ఎవరి మాట వినరు. చివరి ప్రయత్నంగా మీచాం, "జనరల్ వాళ్లడిగినవన్నీ ఇద్దాం. ఇస్తామని చెప్పండి. ప్లీజ్ ఫర్ గాడ్స్ సేక్, ప్రామిజ్ దెమ్" అంటూ కాంచీని అర్థించాడు.

కాంచీ జవాబుకు నిరీక్షించకుండానే, జాక్ కాస్త వెనక్కి వెళ్ళి నిల్చున్నాడు షాంచిన్ జాన్ "ఇక మాటలొద్దు. మీ మంచితనమేదో చేతల్లో చూపండి. సైనికులను వెనక్కి తీసుకోండి. మా భూమి మాకివ్వండి. నో మోర్ టాక్" అంటూ కోపంగా కాంచీ వైపు చూశాడు. అతడి కళ్లు నిప్పులు కక్కుతున్నాయి.

కెప్టెన్ జాక్, విసురుగా వెనక్కి తిరిగి మాడాక్ (భాషలో)

"ఒట్వే-కౌ-టక్స్-ఎ" (ఆల్ రెడీ!) అంటూ అరిచాడు. అనుచరులకు అది సంకేతం. యుద్ధ శంఖారావం! మొదట జాక్ తన పిస్తోలు తీసి కాంచీకి గురి పెట్టాడు. 'లాక్' వుందేమో, మొదటిసారి ట్రిగ్గర్ నొక్కినా పేలలేదు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కాంచీ ఎప్పుడూ వూహించలేదు. ఏం జరుగుతోందో కూడా అర్థంకాలేదు. పిస్టల్ పేలింది. కాంచీ కుప్ప కూలాడు. బోస్టన్ చార్లీ కాల్పుల్లో రెవరెండ్ థామస్ నేలకొరిగాడు. షాంచిన్ జాక్ చేతిలోని పిస్టల్ లాక్కుని మీచాం ప్రాణం కాపాడింది వైనెమో. ఈ గందరగోళంలో డైమాల్, రిడిల్ తప్పించుకొని, ప్రాణాలతో బయటపడ్డారు.

కాంచీ యూనిఫాం విప్పి (సైనికుణ్ణి అవమానించే పద్ధతిది) మాడాక్స్ యోధులతో తెల్లవాళ్ళ దాడిని ప్రతిఘటించటానికి సిద్ధ పడ్డాడు జాక్ (ఇంతా చేస్తే, ఈ చివరి సమావేశంలో 'హుకర్ జిం' లొంగుబాటు గురించి చర్చించనే లేదు).

మూడు రోజుల తర్వాత యుద్ధం

జాక్ కోసం వేట మరికొన్నాళ్లు కొనసాగింది. అడివిజంతువులను వేటాడినట్టే అతణ్ణి ఎవరు ముందర 'ట్రాప్' చేస్తారా అని సైనికులు పోటీలు పెట్టుకున్నారు. దట్టమైన అడవిలో, కొంత దూరం పరిగెత్తి జాక్‌నూ, మరో ముగ్గురు మాడాక్స్‌నూ బంధించారు. పరిగెత్తలేక, నడవలేక కూలబడినప్పుడు జాక్ కాంచీ యునిఫాంలోనే వున్నాడు. "నాపనై పోయింది. చంపండి" అంటూ అర్థించాడు.

ప్రారంభమైంది. లావా బెడ్స్ మీద శతఘ్నులు అగ్నివర్షం కురిపించాయి. సముద్రపు అలల లాగ పదాతి సైన్యం అంగుళమంగుళం జల్లెడ పట్టింది. ఎంత వెదికినా ఒక 'మాడాక్' కూడా దొరకలేదు. వాళ్ళంతా ఎప్పుడో పారిపోయారు. ఇంత కష్టపడి, ఈ 'గెరిల్లా' ల కోసం వెదకటమెందుకని, సైన్యం, 72 మంది కిరాయి ఇండియన్లను (టెనినో తెగకు చెందిన వాళ్ళు) మాడాక్స్ ఆచూకీ తెలుసుకోవటానికి వినియోగించింది.

యుద్ధం జరిగిన ప్రతిసారీ జాక్ తీవ్రంగా ఎదిరించాడు. సైనికులకే ఎక్కువ నష్టం జరిగింది.

కాని, ప్రభుత్వ బలగాలతో పోల్చితే, మాడాక్స్ శక్తి ఎంత! అత్యాధునిక ఆయుధాలు, సురక్షితులైన సైనికుల వ్యూహాల ముందు మాడాక్స్ ఓటమినంగీకరించక తప్పలేదు. చెల్లాచెదురై, చెట్టు కొకరు పుట్టకొకరుగా పారిపోయి, ఆకలికి గుర్రాలనే చంపుకుని తిన్నారు. రోజుల తరబడి నీళ్లు కూడా దొరకలేదు. నోరెండుకు పోయి మరణించిన వాళ్ళెందరో! కెప్టెన్ జాక్‌కు యుద్ధతంత్రం తెలియదని నిందించాడు హుకర్‌జిం. మరికొన్నాళ్లకు ఆశ్రయమిచ్చి తన కోసమే ప్రాణాన్ని కూడా పణంగా పెట్టిన జాక్‌ను వదిలి, తన అనుచరులతో వేరు దళం ఏర్పరచుకున్నాడు. ఇప్పుడు జాక్‌కు మిగిలింది ముప్ఫై ఏడు మంది యోధులు. వెయ్యికి పైగా సైనికులు అతని కోసం గాలిస్తున్నారు.

నెల గడిచిందో లేదో, హుకర్ జిం తన బృందంతో సైన్యానికి లొంగిపోయి కెప్టెన్ జాక్‌ను వెదికి పట్టించే షరతుమీద క్షమాభిక్ష కూడా సంపాదించాడు. కొత్త మిలటరీ కమాండర్ జనరల్ జెఫర్సన్ సి. డేవిస్ అతనికి సైనిక రక్షణ కూడా కల్పించాడు. మే 27 నాడు, హుకర్‌జిం, తన కోసం ప్రాణమిస్తానన్న జాక్‌ను ప్రాణాలతో పట్టించటానికి బయల్దేరాడు. మిత్రద్రోహానికిది పరాకాష్ట.

క్లియర్ లేక్ దగ్గర ఒంటరిగా వున్నాడు జాక్. లొంగిపోతే సైన్యం అతడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. మాడాక్స్ అందరికీ న్యాయం జరుగుతుంది. ముఖ్యంగా తినగలిగినంత భోజనం దొరుకుతుందని నమ్మబలికారు.

"ఎందుకీ అబద్ధాలు.. నన్ను పట్టి శత్రువులకు అప్పగించటం పెద్ద పనేమీ కాదు. కనీసం ఇప్పుడైనా, మగాళ్లలా ధైర్యంగా మాట్లాడండి. కయోటీ (ఉత్తర అమెరికాలో సంచరించే 'తోడేలు' లాంటి చిన్న జంతువు) ల్లాగ అడవులు పట్టిన మీరు వాగ్దానాలు చేస్తున్నారా! మీరెక్కి వచ్చిన గుర్రాలు సైనికులవి, మీ తుపాకులు సైనికులవి. నన్ను బంధిస్తే మీరు స్వేచ్ఛ నిస్తామన్నారు తెల్లవాళ్లు. మీ జీవితం మీకు చాలా తీపి. కాని కాంచీని చంపక తప్పదని నన్ను బలవంత పెట్టినప్పుడు నాకు కూడా ప్రాణమంటే తీపి అని మీకు తెలియదా! జీవితమంటే అందరికీ తీపేనని నాకు తెలుసు. అందుకే యుద్ధం నివారించి, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామన్నాను. పోనీ అందరం కలిసి పోరాడితే, కొద్దిగానైనా ఫలితం దక్కేదేమో! కాని మీ బెదిరింపులకు లొంగి, కాంచీని చంపినప్పుడే నాకు తెలిసింది - మృత్యువు చేరువలో ఉందని.

ఆత్మ గౌరవాన్ని అమ్ముకొన్న మీరు కడుపు నిండా తినండి. మిత్ర ద్రోహులారా, కలేజా లేని మీరు మాడాక్స్ తెగకే అవమానం" అంటూ ఆక్రోశించాడు జాక్.

అతణ్ణి అమితంగా బాధించిన విషయమేమిటంటే - తెల్లవాళ్లకు లొంగిపోయిన వీళ్లే తనను పిరికి పంద అంటూ గేలి చేశారానాడు. వీళ్ల సాధింపులు భరించలేకే తను కాంచీని చంపుతానని వాగ్దానం చేశాడు. లొంగిపోయినా ఎవరూ తనను బందీగా అంగీకరించరు. 'కాంచీ' హంతకుడికి ఉరిశిక్ష తప్పదని అందరికీ తెలుసు. ఉరితాటి మీద వెళ్లాడటం కన్నా తుపాకీ గుండుకు ఎదురొడ్డి నిలవటం వీరలక్షణం. చేతిలో తుపాకీతో చావటం తన చివరి కోరికన్నాడు.

"మీరు తిరిగివెళ్ళి తెల్లవాళ్ల మోచేతి నీళ్లు తాగుతూ బతకండి. బతికినా, చచ్చినా నేనిక్కడి నుండి కదలను. మీ వంటి వూరకుక్కలు మళ్లీ యిటు వైపు రావద్దు".

జాక్ కోసం వేట మరికొన్నాళ్లు కొనసాగింది. "అడివిజంతువులను వేటాడినట్టే అతణ్ణి ఎవరు ముందర 'ట్రాప్' చేస్తారా అని సైనికులు పోటీలు పెట్టుకున్నారు. దట్టమైన అడవిలో, కొంత దూరం పరిగెత్తి జాక్‌నూ, మరో ముగ్గురు మాడాక్స్‌నూ బంధించారు. పరిగెత్తలేక, నడవలేక కూలబడినప్పుడు జాక్ కాంచీ యునిఫాంలోనే వున్నాడు. "నాపనై పోయింది. చంపండి" అంటూ అర్థించాడు.

ఇంకా వుంది....

పెండ్యాల మురళి

'లవకుశ'లో సీతాదేవిగా అఖిలాంధ్ర ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయిన నటి అంజలీదేవి. ఎన్నో పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించిన తొలి తరం నటి. మరెన్నో చిత్రాల్లో తల్లి పాత్రను కరుణరసాత్మకంగా పోషించి 'అమ్మ అంటే ఇలా వుండాలి' అనిపించిన నటి. నటించడంతోనే సరిపుచ్చు కోకుండా సొంత బ్యానర్ 'అంజలీ పిక్చర్స్' స్థాపించి ఎన్నో చిత్రాలను రూపొందించారు. ఈ బ్యానర్‌మీద వచ్చిన ద్వితీయ చిత్రం 'అనార్కలి' (1955). ఈ చిత్ర నిర్మాణ, సంగీత దర్శకత్వ బాధ్యతలు అంజలీదేవి భర్త పి. ఆదినారాయణరావు వహించారు. ఈ చిత్రం గొప్పతనానికి కారణం సంగీతం. జీవితమే సఫలమూ.. రావోయి సఖీ, నను కనుగొనుమా, సో జానా మనోహరీ, తాగి తూగేనని తలచేనూ లోకము, మా కథలే ముగిసెనుగా ఈ విధీ- ఇవన్నీ ఆణిముత్యాలు. సంగీతపరంగా ఈ చిత్రం తనకు బాగా ఇష్టమని అలనాటి నటి అంజలీదేవి చెబుతున్నారు. ఇటీవలే హైదరాబాద్ వచ్చి 2007 అక్కినేని నాగేశ్వరరావు అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆమెతో జరిపిన ఇంటర్వ్యూ....

'లవకుశ'లో ఎన్టీఆర్‌తో

అప్పటి పాత్రలు, కథలు వేరు

అక్కినేని అవార్డు మిమ్మల్ని వరించింది. మీకు ఎలా అనిపిస్తోంది?

ఇది ప్రత్యేకమైన అవార్డు. జాతీయ అవార్డులు ఎన్నో వచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో పెట్టిన ఈ అవార్డు దేవానంద్ అంతటివారికి దక్కింది. నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో శాశ్వతంగా నిలిచిపోయే అవార్డు. ప్రజలు ఆనందిస్తారు కూడా. చాలామంది ఇప్పటికే ఫోన్లద్వారా తమ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నా ప్రతిభను గుర్తించి ఇవ్వడంతో పాటు ఆప్యాయత కూడా దాగి ఉంది.

నటిగా కెరీర్‌ను విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది?

ఆ రోజులు వేరు. అదృష్టవంతులం. అప్పటి పాత్రలు, కథలు వేరు. ప్రతి పాత్రలో ఏదో ఒక సందేశం ఉండేది. పౌరాణికాలు, సాంఘికాలు చాలా చేశాం. అమ్మ పాత్రలు వేసిన సినిమాలు చూసి అప్పట్లోనే 'మీ లాంటి అమ్మ దొరకాలని ప్రార్థిస్తున్నానని' చాలా మంది ఉత్తరాలు రాసేవాళ్ళు. ఆనాడు ఇంత టెక్నాలజీ లేదుగా. 'ఇలవేల్పు' సినిమా చూశాక సిగరెట్లు కాల్చడం మానేశామని.. చాలామంది ఉత్తరాలు రాశారు. ఆర్టిస్టులుగా గొప్ప అనేకంటే.. మంచి టెక్నీషియన్స్ లభ్యంకావడం అదృష్టమని చెప్పాలి. పొద్దునే 7 గంటల నుంచి 1గంట వరకు, 2 నుంచి 9, 9 నుంచి రాత్రి 1గంట వరకు షూటింగ్‌లు మూడు షిఫ్టులుగా చేశాం. తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటించాను. ఇప్పటి రోజులు మారిపోయాయి. టీవీల వల్ల మమ్మల్ని ఇంకా గుర్తుపెట్టుకున్నారు.

'లవకుశ'లో సీతగా చేస్తున్నప్పుడు ఎలా ఫీలయ్యారు?

పాత్రపై పవిత్ర భావన పెట్టేవాళ్ళం. సన్నివేశానికి ముందు దర్శకుడు చక్కగా వివరించేవారు. దానివల్ల పాత్రలో ఇన్‌వాల్వ్ అయ్యేవాళ్ళం. సీత పాత్ర గురించి రీసెర్చ్ అంటూ ఏమీ చేయలేదు. ఆ పాత్ర గొప్పదనం దర్శకుడిది, కెమెరామెన్‌ది. స్టూడియోను దేవాలయంగా భావించేవాళ్ళం. అప్పుడు నటించడం మినహా ఇంకో వ్యాపకం లేదు. షూటింగ్ మధ్యలోకూడా ఎవ్వరితోనూ మాట్లాడేవాళ్లం కాదు.

'గొల్లభామ'లో అవకాశం ఎలా వచ్చింది?

నాకు నేనుగా సినిమాల్లోకి రాలేదు. ఎనిమిదవ ఏటనే డ్రామాలు వేసేదాన్ని. అప్పుడు 'స్ట్రీట్ సింగర్స్' అనే డ్రామా వేశాను. సి.పుల్లయ్యగారు నన్ను అందులో చూశారు. అప్పటికే నా భర్త ఆదినారాయణగారితో నాకు పరిచయం ఉంది. ఆయనా పుల్లయ్యగారు కాకినాడలో క్లాస్‌మేట్స్. 'ఆ అమ్మాయి బాగా చేసింది. నా సినిమాలో ఓ పాత్ర ఉంది చేస్తుందా' అని అడిగారట.. అలా నేను జనవరి 13న భోగినాడు మదరాసులో కాలు పెట్టాను. తీరా నన్ను చూశాక అక్కడ చాలామంది 'చాలా చిన్న వయస్సు ఏం చేయగలదు? ' అని మొహంమీద అనేశారు. ఇంకా చాలా చాలా అన్నారు. నాకు ఒక్కసారిగా ఏడుపొచ్చింది. పుల్లయ్యగారే ధైర్యం చెప్పారు. పైగా డ్రామా అలవాటు వల్ల పదిమంది ముందు నటించడం భయమనిపించలేదు. మొదటి షాట్‌కే ఓకే అన్నాక.. అంతా మెచ్చుకున్నారు. అలా సినిమాలు చేస్తుండగా తమిళ నిర్మాతలు ఆఫర్లతో ముందుకు వచ్చారు. మోహిని, బాలరాజు... ఇలా చాలా చిత్రాలు తమిళంలో చేశాను.

'కీలుగుర్రం'లో రాక్షసిపాత్ర వేయడానికి ప్రత్యేక కారణమేమైనా ఉన్నదా?

ఆ పాత్ర వేయడానికి మూడు నెలల వ్యవధి తీసుకున్నాను. మీర్జాపూర్ రాజా ఆ సినిమా నిర్మాత. నేను చేయకపోతే సినిమా తీయనని అన్నారు. ఆ తర్వాత.. 'నువ్వు ఆర్టిస్టువా? అంజలీదేవివా? ఏం కావాలని వచ్చావ్?' అంటూ ప్రశ్నలు కురిపించారు. ఆర్టిస్టుగా అన్ని పాత్రలు చేయాలన్నారు. అలా ఆ పాత్ర వేశాను. అప్పట్లో అభిమానులను చూస్తే కొత్తగా ఉండేది. మమ్మల్ని చూడగానే అరుపులు, కేకలు, ఈలలు వేస్తుంటే తెలీని భయమేసేది. ఏదో తప్పు చేశామా అనే ఫీలింగ్ వచ్చేది. అప్పుడు నాగేశ్వరరావు 'వారు మెచ్చుకుంటున్నారు. తిట్టడంలేదులే..' అనేవాళ్ళు...

మీరు చాలా పౌరాణిక సినిమాల్లో నటించారు. గ్రాంథికం నిండిన డైలాగులు చెప్పడం కష్టంగా అనిపించలేదా?

రంగస్థలం నుంచి వచ్చినదాన్ని గనుక ఎటువంటి పద్యాలైనా కంఠతాపట్టి చెప్పేవాళ్ళం. అలా అలవాటయింది. ఏదైనా కష్టంగా ఉంటే ...అది రాసిన కవితో దాని అర్థం చెప్పించుకునేవాళ్ళం. అర్థం తెలిశాక అందులో ఇన్‌వాల్వ్ అయి ఈజీగా డైలాగులు చెప్పేవాళ్ళం.

(మరిన్ని వివరాలు పైవారం)

పాల రసగుల్లా

కావలసిన పదార్థాలు

విరిగిన పాలు- 1/2 లీటరు

డాల్డా- 10 స్పూన్లు, పంచదార- 200 గ్రా॥

యాలకులు-2

తయారు చేసే విధానం

విరిగిన పాలను సన్నటి సెగ మీద ఉంచితే నీరంతా ఆవిరై పోయి పొడిగా జున్నులా అవుతుంది. నీటి తడితో ఉసిరికాయ సైజులో ఉండలుగా చేసుకోవాలి. బాండీలో డాల్డా వేసి దోరగా వేగనివ్వాలి. జాగ్రత్తగా అటూ ఇటూ కదుపుతూ ఉండాలి. చక్కెరతో పాకం తయారు చేసుకోవాలి. ఈ వేగిన ఉండలను పాకంలో వేయాలి. యాలకుల పొడిని అందులో వేసి గంట సేపు ఉంచాలి. పాల రసగుల్లా రెడీ.





బాంబినోపులిహోర

కావలసిన పదార్థాలు

బాంబినో-1/2 కిలో, శనగపప్పు-100 గ్రా॥, నూనె- 150 గ్రా॥, నిమ్మకాయలు-5, పచ్చిమిర్చి- 10, పసుపు - చిటికెడు, కరివేపాకు- 2 రెబ్బలు, ఎండుమిర్చి-10

ఉప్పు-తగినంత, అల్లం ముక్క- 1 అంగుళం

తయారు చేసే విధానం

ముందుగా బాంబినోను కొలిచి ఎన్ని గ్లాసులైతే అన్ని గ్లాసుల నీళ్ళు తీసుకోవాలి. అందులో పసుపు వేసి స్టౌ మీద పెట్టి మూత పెట్టాలి. నీళ్ళు బాగా పొంగులు వచ్చాక కొలిచి పెట్టుకున్న బాంబినోని పోసి, పలుకులుగా ఉన్నప్పుడే దించి ఒక బేసిన్‌లో ఆరబెట్టాలి.

బాండీలో నూనె పోసి కాగిన తరువాత తాలింపు దినుసులు వేసి, దోరగా వేగనివ్వాలి. తరువాత పచ్చిమిర్చి, అల్లం, ముక్కలుగా చేసి వేసి, వేగిన తరువాత దించెయ్యాలి. చల్లారిన బాంబినోలో ఉప్పు కలిపిన నిమ్మరసాన్ని పోసి బాగా కలియబెట్టాలి. తర్వాత వేయించి పెట్టుకున్న వేరుశనగ పప్పును బాంబినోలో కలపాలి. ఈ మొత్తాన్ని ఒకసారి కలియబెట్టి తింటే చాలా రుచిగా ఉంటుంది.

కారపు అప్పలు

కావలసిన పదార్థాలు

బియ్యపు పిండి- రెండు కప్పులు,

పచ్చిమిర్చి పేస్ట్- 2 టీ స్పూన్లు,

ఉల్లితరుగు- 1 కప్పు

అల్లం, వెల్లుల్లి ముద్ద -1 టీస్పూను, నువ్వులు- 1/4 కప్పు,

శనగపప్పు- 1/4 కప్పు, కరివేపాకు ఆకులు- 10, జీలకర్ర- 1 టీస్పూన్,

ఉప్పు-తగినంత,

నూనె -వేయించటానికి తగినంత

తయారు చేసే విధానం

బియ్యపు పిండిని ఒక డిష్‌లోకి తీసుకోవాలి. దీనికి ఉల్లి తరుగు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, శనగపప్పు, నువ్వులు, జీలకర్ర, కరివేపాకు రెబ్బలు, కలిపి తగినన్ని నీళ్ళు పోసి పిండిని ముద్దలా కలపాలి. దీనిని చిన్న ఉండలుగా చేసుకోవాలి. తడి బట్టపై ఉండను పెట్టి చేతితో పూరీ మాదిరిగా వత్తాలి. లేదా పూరి ప్రెసర్‌లో రెండు వైపులా పాలిథిన్ పేపర్స్ (లేదా పాలపాకెట్స్ కట్ చేసి కడిగి తుడిచి) వుంచి నూనె రాసి వాటి పైన కూడా పిండి ఉండను పెట్టి పూరీ మాదిరిగా ప్రెస్ చేసి నూనెలో దోరగా వేయించాలి. ఇవి వేడిగాను బాగుంటాయి. చల్లారిన తరువాత కూడా రుచిగా ఉంటాయి.



గ్రిల్ల్‌డ్ పెప్పర్ చికెన్

కావలసిన పదార్థాలు

లేత బ్రాయిలర్ కోడి- 1, మిరియాలు- 15 గ్రాములు (మెత్తని పొడిగా నూరుకోండి), వెన్న-కొంచెం, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

చికెన్ నాలుగు భాగాలుగా చేసి, బాగా కడిగి, శుభ్రం చేసుకోండి. నీరు అద్ది, ఆ ముక్కలపైన పలుచగా వెన్న పూయండి. ఆ పైన పలుచగా ఉప్పు రాయండి. అరగంట ఊరనివ్వండి. ఆ ముక్కలపైన మెత్తగా నూరుకున్న మిరియాల పొడిని ముక్క అంతా అంటుకునేలా పూయండి. గ్రిల్‌లో బాగా వేడిమీద ఒక నిముషం రెండు వైపులా తిప్పి, కాల్చి, ఆ పైన సన్నని వేడి మీద ముక్కను చక్కగా వుడికేంత వరకూ కాల్చండి. చివరగా వీటిని గ్రిల్ చేసిన క్యాప్సికమ్, టొమేటో చక్రాలు, సూప్‌తో వడ్డించండి.

సౌరకుటుంబం



హాయ్ పిల్లలూ! ఇదిగో ఇవాళ మీకోసం ఒక తమాషా పజిల్ తీసుకొచ్చాం. ఇందులో బోలెడన్ని ఖాళీ బాక్సులు వున్నాయికదా. వాటిలో సౌరకుటుంబ సభ్యులు, ఒక ఉపగ్రహాన్ని నింపాలి. వాటి పేర్లు కిందే వున్నాయి...చూసి గబగబా నింపేయండీ...

(mercury, venus, earth, mars, jupitor, saturn, uranus, neptune, pluto, sun, moon)

జత చేద్దామా

హేయ్! మీకు సర్కస్ అన్నా... అందులో బోలెడన్ని ఫీట్లు చేసే వారన్నా...ఎంతో ఇష్టం కదా. ఇదిగో ఇక్కడ సర్కస్‌లో కనిపించే జంతువులు, విదూషకులు, ఫీట్లు చేసేవారు వున్నారు. కాకపోతే ఆ ఆంగ్ల పదాలు విడిపోయి వున్నాయి. మీరేం చేయాలంటే... ఆ పదాలను సరిగ్గా జతచేయాలి.



చూసి గీసేద్దాం





ఇదిగో పిల్లలూ! ఇక్కడ పై గళ్లల్లో ఒక పక్షి బొమ్మ వుంది. మీరేం చేయాలంటే దాన్ని చూచి అచ్చు గుద్దినట్టు కింది బాక్సుల్లో గీయాలి. మరి పెన్సిల్, ఎరేజర్ తీసుకొని రెడీ అయి పోండీ...

ఓడను చేరేదెలా!

ఈ బొమ్మలో కనిపిస్తున్న వ్యక్తి నీటిలోపల వున్న ఓడను చేరాలి. మార్గమధ్యలో బోలెడన్ని ఆటంకాలు వున్నా... వాటిని తప్పించుకొని ఓడను చేరుకోవాలి. మరి మీరేమైనా కాస్త సాయం చేస్తారా!



ఆ రెండు రంగులు ఏవి?

రంగులను ఇష్టపడని వారుండరు. మీరు కూడా అంతేనని మాకు తెలుసులే. ఇక్కడ ఒక్కో బాక్సులో ఒక్కో ఆంగ్ల అక్షరం వుంది. అలాగే ఆ అక్షరం వున్న బాక్సును ఒక్కో సున్నాకు జతచేసి వుంది. అసలు సంగతేంటంటే... ఆ బాక్సులో వున్న అక్షరాన్ని జత చేసిన సున్నాలో రాయాలి. అప్పుడు మీ ముందు రెండు రంగుల స్పెల్లింగులు ప్రత్యక్షమవుతాయి. ఇంతకీ నేస్తాలూ! ఆ రెండు రంగులూ ఏవి?

జవాబు: (blue, green)

పూరించండి చూద్దాం

చిచ్చర పిడుగులూ! మీకు లెక్కలు బాగా వచ్చని పెద్ద ఫోజు పెడుతుంటారుకదా. మరైతే ఒక్కటంటే ఒకటే నిముషంలో ఈ లెక్కల పజిల్‌ను పూరించండి చూద్దాం. అంతా అయ్యాక మా సమాధానంతో మీ జవాబులను సరిచూసుకోండి.

(జవాబులు: 3+4=7, 3+1=4, 4+5= 9, 7+2=9, 4+1=5)

3	+		=	7
+	■	+	■	+
		1		
=	■	=	■	=
4	+		=	9



ఎల్. సత్యనారాయణ, 7వ తరగతి, శ్రీ సరస్వతి విద్యాలయం, కంచరాం, రాజాం, శ్రీకాకుళం.

ఎస్. సునీల్, 6వ తరగతి, గురుకుల విద్యాలయం, కొహెడ, కరీంనగర్.





ఎం. సాయిచంద్, 5వ తరగతి, ఏకశిల పబ్లిక్ స్కూల్, శ్రీమాన్, నారాయణపురం.

డి. విశ్వేశ్వరరావు, 6వ తరగతి, శ్రీ సరస్వతి విద్యాలయం, కంచరాం, రాజాం, శ్రీకాకుళం.

అద్భుత గాయని పి. సుశీల

డా॥ జె.పి. వైద్య

ఏ వేగులవాళ్ళూ, జేమ్స్ బాండ్ 007ల అవసరం లేకుండా 'బాలివుడ్'లోని లతా మంగేష్కర్, ఆశా భోంస్లే, గీతా దత్, ముబారక్ బేగమ్‌ల నుంచి 'టాలివుడ్'లోని పి. సుశీల, జానకి, జిక్కి, లీల, భానుమతిల వరకూ అందరి గొంతులూ మా గుండెలో గూడు కట్టుకున్నాయి.

మేము 'బినాకా గీత మాలా' వింటూ పెరిగాము.

'మన్ చాహే గీత్'-'భూలే బిసరే గీత్' - 'ఛాయా గీత్'లు మాకు పాఠ్యపుస్తకాల కన్నా 'అతి' ముఖ్యమైనవి.

అందుకే లతా మంగేష్కర్‌కు 'భారత రత్న' వచ్చినప్పుడు పండగ చేసుకున్నాం. కాని, మనస్సులో ఏ మూలో కాస్తంత వెలితి!

కాస్తంత వైరాగ్యం... మరి కొంచెం బే చైనీ!!

కాస్తంత కోపం... మరి కొంచెం ఒళ్ళు మంట!!!

మా 'సుశీల'కు పద్మం.... రత్నం... ఇవ్వాలని పెద్దోళ్లకు ఎందుకు తెలియటం లేదన్న, 'బే చైనీ' మొన్న 'ఠక్కున' చల్లారి పోయింది.

దాదాపు 5-6 దశకాల క్రితం ముచ్చట.....!

మాతో పాటు ఈ తరం 'యువకులం' అప్పటికి 'బ్యార్' మంటూ ఏడుస్తూ ప్రపంచంలో పాదాలు కూడా మోపని రోజుల నాటి ముచ్చట....!

కొన్నాళ్లకు చేతుల్లో గోటీలు... గోలికాయలూ... గిల్లిదండాలూ... క్రికెట్ బ్యాట్లూ వచ్చినా మనస్సులో ఎక్కడో 'స-రి-గ-మ'లు దోబూచులాడే ముచ్చట....! నేడే చూడండి... న్యూ థేటర్ వెండి తెర మీద గొప్ప నవరస భరితమైన సన్నివేశాలూ... హీరో హీరోయిన్ల జబర్ దస్త్ పాటలూ.... తప్పక చూడండి...' అని రిక్షాలో 'లౌడ్ స్పీకర్లో సేన్మ అడ్వటేజ్‌మెంట్' వచ్చినప్పుడల్లా, చడ్డీలు కిందికి జారిపోతున్నా పట్టించుకోకుండా, కళ్ళూ ఒళ్ళూ అప్పగించేసి 'సేన్మా పోస్టర్ మీది 'ముద్దు గుమ్మ + మీసాలబ్బాయి' వెనక పెద్ద పిడికెడు మీసాల, భింగ్రీ కళ్ళ విలన్ గాడి చూపులను ధైర్యంగా చూడలేకపోయిన ముచ్చట....!

మాకు తెలియకుండానే జీవితంలో సినిమా పోస్టర్ల లోంచి నాగేశ్వర్రావ్, ఎంటీరామారావు, సావిత్రి, రాజసులోచనలు దిగి వచ్చి మా ఇళ్ళల్లో దూరిపోయారు. మా పుస్తకాల అట్టలై ప్రతీక్షణం మాతోనే ఉండిపోయారు.

'హు! ఫాల్తు పోరగాండ్లు....! చెడిపోతున్నారు'- అని మా 'పంతుళ్ళూ', 'ఏందీ? గీ హౌలగాళ్ళు గా సేన్మ రిక్షల పొంటి ఉర్కుతున్రు...! జర్ర కంట్రోల్ల ఉంచున్రి... పెద్దగైనంక ఎటూ పనికి రాకుంట పోతరు'... అని పెద్దోళ్ళూ గోల 'షురూ' చేసిన ముచ్చట...!

హీరోలూ ... హీరోయిన్లూ మా చదువుల పుస్తకాలు మారిపోయినట్టు మారిపోయారు. కాని, 'స-రి-గ-మ'ల చుట్టూ బలంగా పెనవేసుకున్న అనుబంధం నాటి నుంచి నేటి దాకా మారలేదు. ఏ మాత్రం చెక్కు చెదరలేదు. పైపెచ్చు ఇంకా బలీయంగా 'ఫెవికాల్' లా అంటుకుపోయింది.

మా సంగీతం 'జనరల్ నాలెడ్జ్' కూడా పెరిగిపోసాగింది. ఉత్తరాదిన హిందీ వాళ్ళ రఫీ, ముఖేష్, కిషోర్, తలత్, మహేంద్రకపూర్‌తో పాటు ఇటు దక్షిణాదిలోని ఘంటసాల, పి.బి. శ్రీనివాస్, రామకృష్ణ, మాధవపెద్ది, బాల సుబ్రహ్మణ్యం మా 'దోస్తు'లై పోయారు.

వాళ్ళకు మా గురించి అస్సలు తెలియక పోయినా, మాకు వాళ్ళ గురించీ, వాళ్ళ అలవాట్ల గురించీ, పాడిన పాటల గురించి అన్ని విషయాలు కూలంకషంగా తెలిసిపోయేవి.

ఏ వేగులవాళ్ళూ, జేమ్స్‌బాండ్ 007ల అవసరం లేకుండా 'బాలివుడ్'లోని లతా

కోకిలమ్మ ఆలపించిన కొన్ని గీతాలు...

సంఘం, బంగారు పాప(59), వద్దంటే డబ్బు, జయసింహ, దొంగ రాముడు(55) మిస్సమ్మ, సువర్ణసుందరి (57) ఇలవేల్పు, ముద్దుబిడ్డ, చెంచులక్ష్మి లాంటి సినిమాలోని పాటలతో ఆమె తారాపథానికి చేరుకున్నారు. కొన్ని గీతాలను తలచుకొని, అలనాటి అందాల్లో కరిగిపోదాం! రండి!!

-'పండువెన్నెలా' (బంగారు పాప-54) అద్దేపల్లి రామారావు

-'అనురాగము విరిసేనా' (దొంగరాముడు) సముద్రాల/పెండ్యాల(55)

-'పిలువకురా/ నీ నీడలోన /బొమ్మాలమ్మా' (సువర్ణసుందరి-57) సముద్రాల /ఆదినారాయణ రావు

-సంగీత సాహిత్యమే యమునా తీరమున (జయభేరి/58) పెండ్యాల /మల్లాది

- ' ఓ నెల రాజా' (భట్టి విక్రమార్క /60) అని శెట్టి / పెండ్యాల

'పాడవేల రాధికా (ఇద్దరు మిత్రులు /61) శ్రీశ్రీ/సాలూరి రాజేశ్వరరావు

-'మోహన రాగ మహామూర్తిమంత మాయే' (మహామంత్రి తిమ్మరుసు-62) (అనిసెట్టి/ పెండ్యాల)

-'వినిపించని రాగాలే' (చదువుకున్న అమ్మాయిలు) 1963/దాశరథి / రాజేశ్వరరావు

-'ఈనాటి ఈ బంధము/ నీ పాట నా నోట (మూగ మనుసులు/64) ఆత్రేయ / కె.వి. మహదేవన్

-'చందన చర్చిత' (తెనాలి రామకృష్ణ/56) (విశ్వనాథం-రామ్మూర్తి)

-'మిస్సమ్మ'లో హీరోయిన్‌కు పి. లీలగారు పాడినా మన సుశీల గారి 'బృందావనమది' మకుటాయమానంగా నిలిచింది.

మంగేష్కర్, ఆశా భోంస్లే, గీతా దత్, ముబారక్ బేగమ్‌ల నుంచి 'టాలివుడ్'లోని పి. సుశీల, జానకి, జిక్కి, లీల, భానుమతిల వరకూ అందరి గొంతులూ మా గుండెలో గూడు కట్టుకున్నాయి.

మేము 'బినాకా గీత మాలా' వింటూ పెరిగాము.

'మన్ చాహే గీత్'-'భూలే బిసరే గీత్' - 'ఛాయా గీత్'లు మాకు పాఠ్యపుస్తకాల కన్నా 'అతి' ముఖ్యమైనవి.

అందుకే లతా మంగేష్కర్‌కు 'భారత రత్న' వచ్చినప్పుడు పండగ చేసుకున్నాం. కాని, మనస్సులో ఏ మూలో కాస్తంత వెలితి!

కాస్తంత వైరాగ్యం... మరి కొంచెం బే చైనీ!! కాస్తంత కోపం... మరి కొంచెం ఒళ్ళు మంట!!!

మా 'సుశీల'కు పద్మం.... రత్నం... ఇవ్వాలని పెద్దోళ్లకు ఎందుకు తెలియటం లేదన్న, 'బే చైనీ' మొన్న 'ఠక్కున' చల్లారి పోయింది.

ఎప్పటిలాగే కుంభకర్ణుడి నిద్రలోంచి బద్ధకంగా లేచిన 'పెద్దోళ్ళు' ఆలస్యంగా నైతేనేం 'పద్మభూషణ్' అవార్డునిచ్చి పి. సుశీల గారిని సత్కరించారు. అసలు ఆమెను సత్కరించడం ఏమిటి?

పి. సుశీల గారి చెంత చేరి 'పద్మ భూషణ్' పొంగిపోయి ఉండొచ్చు!

మనస్సుకు అంతో ఇంతో సంతోషం, సంతృప్తి కలిగించే ప్రతి విషయానికి తర్కం అవసరం లేదు.

ఆ అవార్డ్ ఏ రాష్ట్రం కోటాలోంచి వచ్చింది? ఇంత ఆలస్యంగా ఎందుకొచ్చింది? దాని వెనుక రాజకీయాలేమిటి?

హిమశిఖరం నుంచి కరిగిన నిహారికా బిందు సందోహం నీటి చుక్కై కొండ పక్క శిథిలమైన గుడిని ఆనుకొని ఉన్న కోనేట్లో కలువపూల రేకుల మీద చేరిన ఆనందం కన్నా... ఇతర పద్మాలతో ఉన్న కోనేటి పద్మాలు సైతం మనస్సు విప్పి అనురాగ వీచికలు సారించిన ఆనందం పంచుకోవటం 'బుద్ధి మంతులు' చేయవలసిన మంచి పని.

సుశీలమ్మ బాల్యం... కుటుంబం...

చతుష్షష్టి కళలకు ఆదరానురాగాల నిధి మన ఆంధ్రప్రదేశ్. కళలకు కాణాచి అయిన 'విజయనగరం'లో పి. సుశీల గారు జన్మించారు. తండ్రి ముకుందరావు ఎంతో పేరున్న క్రిమినల్ లాయర్. వృత్తి రీత్యా 'క్రిమినల్స్'-'పోలీసులూ'-'క్లైంట్లతో' సాగే వకీలు గిరీ అయినా ప్రవృత్తి రీత్యా సంగీతం అంటే మంచి ప్రవేశం ఉన్న మహనీయుడాయన. తల్లి 'శేషావతారం' కూడా సంగీతం ఎడల అత్యంత మక్కువ ఉన్న సంస్కారవంతురాలు. ఇంట్లో చక్కటి సాంప్రదాయాలూ... సంగీతం పదనిసలే! అందరికీ సంగీతంలో మంచి ప్రవేశం ఉన్న 'సంగీత మహల్' లాంటిది వారి ఇల్లు.

చిన్నప్పుడే సుశీల గారిలో ఉన్న సంగీతపు అనురాగం, అపారమైన ప్రతిభాపాటవాలు గమనించి ఎంతో ప్రోత్సహించారు వాళ్ళందరూనూ!

ఆ రోజుల్లో విజయనగరం మహారాజా సంగీతకళాశాలకు 'ప్రిన్సిపల్'గా ఉన్న పెద్ద మనిషి 'ద్వారం వెంకటస్వామి నాయుడు గారు'. ఆయన సువిఖ్యాత వయొలిన్ విద్వాంసులు.

సంగీతంలో మాత్రం ఫస్ట్

అక్కడే సుశీల గాత్రంలో ప్రథమశ్రేణిలో డిప్లొమా తీసుకున్నారు. ఆ జ్ఞాపకాలను తలచుకుంటూ, చిరునవ్వుతో ఇప్పటికీ అంటుంటారు 'నాకు చిన్నప్పటి నుంచీ చదువుకన్నా సంగీతం అంటేనే ఎంతో ఇష్టం.



చూడాలని వుంది...అమ్మని చూడాలని వుంది

భోరున కుండపోతగా వర్షం కురుస్తూ, ఉరుములూ, మెరుపులూ మెరుస్తున్న ఒకానొక దురదృష్టకరమైన పూట వాళ్ళమ్మగారు రేడియో వింటున్నారు. పిడుగు కరెంట్ రేడియో గుండా సోకి ఆవిడ చనిపోయారు. ఆ క్షణాలు సుశీలను ఎల్లప్పుడూ వేటాడేవి. వెంటాడేవి.

పెండ్యాల నాగేశ్వరరావు గారి సంగీతంలో 'ముద్దు బిడ్డ' కోసం సుశీలగారు గానం చేసిన ఒక గీతం ఉంది... 'చూడాలని ఉంది... అమ్మని చూడాలని ఉంది'. తన తల్లి ఆఖరు క్షణాలను తల్చుకుంటూ పాడిన ఆ గీతంలోని విషాదం నేటికీ శ్రోతలను కదిలించి కళ్లను వర్షింపచేస్తుంది. 'ఫీలింగ్'తో పాడటం అంటే అది!

సబ్జెక్టులన్నింటిలోనూ పిడికెడు మార్కులొచ్చినా సంగీతంలో మాత్రం 'ఫస్టు మార్క్'. ఎప్పుడూ తప్పలేదు' అని. ఆ తర్వాత ఆమె మద్రాసు మ్యూజికల్ అకాడమీలో కర్ణాటక శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించారు. అప్పటి అకాడమీ అధినేత 'ముసిరి సుబ్రహ్మణ్యం అయ్యర్' గారు. శాస్త్రీయ సంగీతం పునాదులు ఎంత గట్టిగా పడుతున్నా లోలోపల మన 'సుశీల' గారికి సినిమా పాటలన్నా, సినిమాలో పాడాలన్నా పెద్ద మోజులా– 'చిటారు కొమ్మమీద మిఠాయి పొట్లం' లాంటి ఆశగా ఉండేది.

కోరిక తీరింది

అప్పటికి లత బాగా పేరున్న గాయనీమణి. ఎ.వి.ఎం. వాళ్ళ కోసం లతా రికార్డింగ్స్ చేసే తంతు సుశీల గారు అద్దాల తలుపుల్లోంచి చూసి పులకించి పోయేవారు.

రేడియోలో సినిమా పాటలు పాడే నిబంధన ఆ రోజుల్లో లేదు. మన సుశీల ఝుమ్మంటూ వెళ్ళి బాలానందం కార్యక్రమంలో 'కీలుగుర్రం' పాట చక్కగా పాడి వచ్చారు.

'కాదు సుమా! కల కాదు సుమా!' అన్నది ఆ గీతం.

అందరూ మురిసిపోయి తలలూపుతూ మెచ్చుకున్నారు.

ఏవియం వాళ్ళ 'ఆడిషన్'లో నెగ్గిందావిడ. వాళ్ల నిబంధనలు కాస్తంత కఠినంగా ఉండేవి ఆరోజుల్లో. ముందర కాళ్ళకు బంధాల్లా భాసించేవి.

ఏవియం వాళ్ళకు తప్ప ఇతరుల కోసం పాటలు పాడకూడదు. ఒకవేళ పాడితే ఆ సదరు కంపెనీ వాళ్లిచ్చే పారితోషికంలో సగం ఏవియం వాళ్ళకే ఇవ్వాలి. ఇవన్నీ ఒప్పుకొని సుశీలగారు ఉద్యోగం కొనసాగించారు.

1953వ సంవత్సరం హుషారుగా వచ్చేసింది.

పెండ్యాల నాగేశ్వర రావుగారు సుశీల గొంతును నిశితంగా గమనించారు. సన్నగా, అందంగా మధురంగా ఉందని శ్లాఘించారు.

ఆ రోజుల్లో సంగీతం దర్శకులు కాస్తంత లావుపాటి మందంగా ఉన్న గొంతులను ఇష్టపడేవారు. పరిచయం చేసేవారు.

'కన్నతల్లి' సినిమాలోని ఒక సన్నివేశం.

పసిపాపను దీవిస్తూ కొందరు మహిళలు పాడే పాటను రికార్డ్ చేస్తున్నారు. రేడియో అన్నయ్యగా ప్రసిద్ధి చెందిన 'న్యాపతి రాఘవరావు' గారిని పెండ్యాలగారు 'చక్కగా పాడే అమ్మాయిలను' పంపమని కోరారు. పాడడానికి వచ్చిన పది మందిలోనూ సుశీల గారి గొంతు ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు, ఎంతో ప్రస్ఫుటంగా ఉంది.

....మురిసిపోయిన పెండ్యాల

బృందగానం కాకుండా, విడిగా కొన్ని పంక్తులు పాడించుకొని మురిసిపోయిన పెండ్యాల ప్రత్యేకంగా ఒక పదమూ, ఏ.ఎమ్. రాజాతో కలిపి "ఎందుకో పిలిచావెందుకో" అనే యుగళ గీతమూ పాడించుకున్నారు.

పెండ్యాల గారు ఆ విధంగా పరిచయం చేసిన 'సుశీల' గారు మన ఇంట్లో మనసుల్లో, జీవితాల్లో ఎంతటి అద్భుతమైన, విలక్షణమైన, అపురూపమైన గీతాలను అందించారో నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

చిన్నారి సుశీల

తెలుగు 'లత'

తెలుగువారి 'లతా' అని కొందరనుకున్నా – సుశీలగారి ప్రత్యేకత ఆవిడదే! మూడేళ్ళపాటు ఓపిగ్గా ఎ.వి.ఎమ్ వాళ్ళ కోసం పాడిన 'సుశీల' వాళ్ళు ఆమె కందించిన జీతం కన్నా – 'నిబంధన'ల ప్రకారంగా కట్టిన సగ భాగమే ఎక్కువైంది అన్న 'సంగీత సూత్రం' గమనించి, కాంట్రాక్ట్ ముగియగానే సగౌరవంగా తప్పుకున్నారు. పాట మీదున్న ఏకాగ్రత, భావ రసాస్వాదనను అందించే తపన, గుండెలను నేరుగా పలకరించేట్టు పాడే నేర్పు, గీతం మీదున్న పట్టు, స్వరసాధన.... సుశీల హేమా హేమీల్లాంటి ఇతర మహిళా కళాకారుల మధ్య తన ప్రత్యేకతను నిలుపుకొని నిలబడ్డారు.





మల్లెపువ్వులాంటి తెల్లటి చీరలంటే ఇష్టం

సినీ ప్రపంచంలో ఉన్న సినిమా పోకళ్ళ జాడ్యం సుశీలను అంటుకోలేదు. లతా మంగేష్కర్‌కు వజ్రాలంటే మహా ఇష్టం... కొల్హాపురి మటన్, ఫిష్ ఫ్రై అన్నా విపరీతమైన ఇష్టం.

మన సుశీల గారు మటుకు సీదాసాదాగా అరచేతి వెడల్పైన ఎర్ర, పచ్చ, నీలపు అంచులున్న తెల్లటి నూలు చీరలంటే ఇష్టపడతారు.

అంచు తప్ప చీర మొత్తం మల్లె పువ్వుల్లా తెల్లగా ... ఆవిడగారి స్వచ్ఛమైన మనస్సులా వుండేవీ ఇష్టమే!!

పొడుగాటి జడకు, విజయనగరం నుంచి తెచ్చి దొడ్లోవేసి పెంచిన సింహాచలం సంపంగి పూలదండ... గుండ్రటి బొట్టు... నో మేకప్!

మొహం నిండా సౌమ్యత, చెరగని అందమైన చిరునవ్వు...'కళ్ళెత్తి చూస్తే కనకాభిషేకం చేసే విశాలనేత్రాలూ...

వరించిన పురస్కారాలు ఎన్నో....

సినిమా సృష్టిలో అణువణువూ హుందాతనం నింపిన సుశీల గారు నేటికీ వారి ప్రత్యేకతను అంతే హుందాతనంతో నిలబెట్టుకున్నారు.

అందుకే లెక్కలేని జాతీయ పురస్కారాలూ, అనేక రాష్ట్రీయ పురస్కారాలూ, తెలుగు, తమిళం, మళయాళం, సింహళం, హిందీ భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడిన ఘనత ఆమెకు చెందింది.

'ప్రైవేట్ సాంగ్స్' అంటే అంతగా మక్కువ లేదనే భావించాల్సి వస్తుంది.

సాలూరి రాజేశ్వరావు, పెండ్యాల నాగేశ్వరరావు, మాస్టర్ వేణూ, టి.వి. రాజు, టి. చలపతి రావు, సుసర్ల దక్షిణా మూర్తి, కె.వి. మహదేవన్, ఎమ్.ఎస్. విశ్వనాథన్, ఘంటసాల, రమేష్ నాయుడు, అశ్వద్ధామ, సత్యం, జి.కె. వెంకటేష్, సుదర్శనం-గోవర్ధనం, రాజన్-నాగేంద్ర, గాలిపెంచల, అద్దేపల్లి రామారావు, చక్రవర్తి, సంగీతం- దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర పింగళి నాగేంద్రరావు, సినారే, ఆత్రేయ, దాశరథి, గుంటూరు శేషేంద్ర శర్మ, వేటూరి లాంటి వాళ్ళ గీతాలు... ఇవన్నీ మన అదృష్ట దీపాలు!

జాతీయ స్థాయి ఉత్తమ గాయని పురస్కారాలు 1969, 1971, 77, 83, 84లో వరుసగా వరించాయి. కేరళ ప్రభుత్వ పురస్కారం 1978–79లో 'కలైమామణి' తమిళనాడు ప్రభుత్వ పురస్కారం, ఆంధ్రా యునివర్సిటీ వారి 'కళాప్రపూర్ణ, ఎన్నోసార్లు 'ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు' ఆమెను చేరి గౌరవాన్వితమయ్యాయి.

ప్రేమించి పెళ్ళి చేసుకున్న 'రాజా రామ్మోహన రావు గారు' విజయనగరం వాస్తవ్యులైన గోదావరి రాజు మాష్టారు గారి రెండో అబ్బాయి. ఆయన మద్రాసులో మెడిసిన్ చదువుతున్న రోజుల్లో ఆమెకు పరిచయమయ్యారు.

సుశీల గారి కెరియర్ గురించి ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. 1993లో గతించారు.
సోదరుడు, కుమారుడు, కోడలు, మనవరాలితో ప్రస్తుతం 'చెన్నై'లో నివాసం.

12 భాషల్లో దాదాపు 40,000 పాటలను శ్రోతలకందించిన మధురగాయని 'సుశీల' గారి 55 సంవత్సరాల 'సరిగమల చరిత్రను' అలా, అక్కడక్కడ స్పృశించినా మన బోటి మామూలు మనుష్యుల జీవితాలు సంగీతమయమైపోతాయి. ఆ మాటకొస్తే అంత అందమైన సంగీతాన్ని మన గుండెల్లో పదిలంగా దాచుకున్న మనం మామూలు గాళ్ళమెలా అవుతాము? మనం 'రియల్లీ మోస్ట్ టాలెంటెడ్ ఫ్యాన్ గాళ్ళం!"

ఇద్దరు ప్రహ్లాదులకు - ముగ్గురు శబరులకు అందంగా, అద్భుతంగా, చారిత్రాత్మకంగా గానం చేసిన సుశీల నేడు చెన్నైలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు.

సంగీతానికి, సరిగమలకు ఎల్లలుంటాయా?
మన పిచ్చిగానీ- 'నిదురించే తోటలోకి పాట ఒకటి' ఎలాగూ వస్తుంది!

రాజకీయాలెంత వెగటు పుట్టేలా ఆటలాడుకున్నా - మన లాంటి మామూలు మనిషిని తట్టి లేపే 'కిలకిల నవ్వులు పలికే'-'చెలికాడిని' ఆటలాడిస్తూ గుండెల్లో నిలిచి పోయిన 'సదాబహార్' గీతాల గాయని 'సుశీల

గారు' ఎక్కడ ఉంటే ఏమి? ఉన్నది మన మనసులోనే! మన గుండె గూడులోనే!

అది మనం చేసుకున్న అదృష్టం!! 'పద్మా'లే చెంత చేరి 'భూషణా'లు కావూ? అది వాటి అదృష్టమేమో!!

❋

కథ

మంచికంటి వెంకటేశ్వరరెడ్డి

ఒక్కోక్షణం వృథా అయ్యేకొద్దీ నాలో గుండె మంట పెరుగుతోంది. బయట నెమ్మదిగా వర్షం ముసురుకుంటోంది.

ఆటో అంతా నిండి పోయింది. ఇంక కదలవయ్యా. పళ్ళు పటపటలాడాయి. కళ్ళు చింత నిప్పులు కక్కాయి. ఊహూ. అతనిలో చలనమేలేదు. సీట్ల మీదా సీట్లు కింద మధ్యలో... కమ్ముల మీద ముందూ వెనకా ఎక్కడ చూసినా మనుషులే మనుషులు.. చీమల్లా దోమల్లా మనుషులు ఎంత మందొచ్చినా ఎక్కుతూనే ఉన్నారు.

పుష్పకవిమానమా ఇది ఏం మాట్లాడవ్? ఉలకవు పలకవు. నువ్వసలు మనిషివేనా... ముసి ముసి నవ్వులు రువ్వుతావేందయ్య. నీకసలు బుద్ధీ జ్ఞానం ఉందా.

అరే ఇంకా వస్తున్నారే! ఎక్కడ ఎక్కుతారయ్యా? అక్కడా ఇక్కడా ఎక్కడానికి బుద్ధి ఉండక్కర్లేదంటయ్యా!

దాహం

తీయతీయని ఊహలతో ఆమె కోసం వేయి గుర్రాలు పూన్చిన రథమెక్కి వెళ్లాలి. త్వరగా.... త్వరత్వరగా వాయువేగ మనోవేగాలతో వెళ్ళాలి. వడివడిగా అడుగులేస్తుంటే... మెదడులో ఏదో కదలిక... హృదయంలో ఏదో ఆతృత. కన్నుల్నిండా ఆమె రూపం బొమ్మకట్టినప్పటి నుండీ ఒకటే ఆరాటం. అంతులేని పోరాటం. ఇన్నాళ్ళు ఆమెను చేరుకోవడం ఎంత కష్టమైపోయింది! ఇక్కడున్నట్లే క్షణాల్లో ఆమె ముందు నిలిస్తే...!! ఆహా ఊహలకే రెక్కలొస్తే ఎంత బావుంటుంది? అందుకే ఊహలు నిజమయ్యే వేళ మౌనం చిలిపిగా అల్లరి చిల్లరిగా మాట్లాడుతూనే ఉంటుంది. కలని నిజం చేసుకోవాలన్న ఊహల్ని కమ్మని కథగా మార్చుకోవాలన్న తపన.... ఆరాటం....

టప్...టప్....టప్ అయ్యో... అయ్యయ్యో చిత్తడి వాన మాయదారి వాన మొదలయ్యిందే.... ఛీ చుప్పనాతి వాన. ఆ... ఇది కూడా మంచికేనేమోలే. ఆమెను ఈ చినుకు పూలహారాల మధ్య తన్మయత్వంతో కలుసుకుంటే, కలిసి పక్కపక్కన నడుస్తూ... తడుస్తూ తడుస్తూ... నడుస్తూ ఆ...హా...హా.... ఓ...హో...హో ఇంకా ఎంత బాగుంటుందో కదా! ఆ తీయని ఊహ గుండె నిండా కమ్ముకు వొస్తుంటే వెచ్చటి ఓదార్పు... ఆమె కౌగిట్లో ఉన్నట్టుగానే ...ఆహా.... తొందరగా ఆమెను చేరుకోవాలి.

అరె... రే ఇక్కడ అంతా శూన్యంగా ఉందే... ఆశ నిరాశే అయ్యిందే. ఏ బస్సూ అందుబాటులో లేదే! ఎలా... ఆ కల చెదిరిపోతుందా ఏం...?

ఎంతసేపీ నిరీక్షణ... అక్కడామె సుతిమెత్తని పాదాలు భూమిని ముద్దాడుతుంటే... గాలి ఊయలకు ఆమె గాయపడుతుందేమో...! ఎంత సేపటి నుండి ప్రేమ పందిరిలో నా కోసం ఎదురు చూస్తోందో...

ఆ...ఆ...అదిగో అల్లదిగో వస్తుందిలే... నా కోసమే ఎవరో పంపించినట్టు వాయువేగ మనోవేగాలతో వస్తోందిలే. హమ్మయ్య! ఇప్పటికి గుండె దిటవు పడింది. కళ్ళ నిండా ఆనందాశ్రువులు జాలువారాయి. అయినా ఓ మనసా ఎందుకే ఇంత తొందర నీకు.

ఏమిటి... కూర్చోకుండా అత నలా వెళ్ళి పోతున్నాడేమిటి? ఇంత వరకూ దానికోసం ఎదురు చూసిన వీళ్ళంతా ఏరీ? సామాన్లు లోపల పెట్టి పరారయ్యారేమిటి?

అయ్యో ఎక్కడి వాళ్ళక్కడ హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారేమిటి? నాగోడు ఎవరూ పట్టించుకోరా! ఎవరికీ హడావిడి లేదా! తొందరగా పోవాలన్న తాపత్రయం ఎవరిలో కనిపించదేమి?

ఆటో ఎవ్వరూ ఎక్కరా! అంత తొందరగా కదలదా! వేగంగా పోదామని కమ్మని కలను తీయగా మలుచుకుందామని, ఊహల పల్లకీనెక్కి ఊరేగుతూ వొస్తే ఇక్కడ ఘోర అవమానాల పాలయ్యానే. ఒక్కొక్కరూ ఆటో ఎక్కుతుంటే డ్రైవర్ ముఖం మతాబులా వెలిగి పోతోంది.

ఒక్కోక్షణం వృథా అయ్యేకొద్దీ నాలో గుండె మంట పెరుగుతోంది. బయట నెమ్మదిగా వర్షం ముసురుకుంటోంది.

ఆటో అంతా నిండి పోయింది. ఇంక కదలవయ్యా. పళ్ళు పటపటలాడాయి. కళ్ళు చింత నిప్పులు కక్కాయి. ఊహూ. అతనిలో చలనమేలేదు. సీట్ల మీదా సీట్లు కింద మధ్యలో... కమ్ముల మీద ముందూ వెనకా ఎక్కడ చూసినా మనుషులే మనుషులు.. చీమల్లా దోమల్లా మనుషులు ఎంత మందొచ్చినా ఎక్కుతూనే ఉన్నారు.

పుష్పకవిమానమా ఇది ఏం మాట్లాడవ్? ఉలకవు పలకవు. నువ్వసలు మనిషివేనా... ముసి ముసి నవ్వులు రువ్వుతావేందయ్య. నీకసలు బుద్ధీ జ్ఞానం ఉందా.

అరే ఇంకా వస్తున్నారే! ఎక్కడ ఎక్కుతారయ్యా? అక్కడా ఇక్కడా ఎక్కడానికి బుద్ధి ఉండక్కర్లేదంటయ్యా!

ఏమ్మా ఆ బిడ్డని సంకనేసుకొని అలా ఊగులాడతావేం! తరువాత రావచ్చుగా... ఒంటి చేత్తో ఆ రాడ్ పట్టుకొని ఊగుతూ... తూగుతూ ఆ చెయ్యి వొదిలితే ఇంకేమైనా ఉందా!

ఏయ్ ముసలోడా మలి యవ్వన మొచ్చిందా ఏం నీ కోసం... ఏం... ఎక్కడ నువ్వెక్కేది?

నువ్ పోనీయవయ్యా. నీకు ప్రాణాలతో చెలగాటమే కానీ మాకు మాత్రం ప్రాణ సంకటమే... ఎవడెట్టా పోతే నీకేంటయ్యా... డబ్బు... డబ్బు... ఆశ... అదే కదా నీకు ముఖ్యం. ఓసి నీ సిగ తరగ. ఆ రాడ్డు మీద కూడా కూర్చుం టున్నావు కదే! బాలాకుమారి నసుకుం టున్నావా...!

ఏయ్.. ఇంక పోనియ్య వయ్యా.... ఆ...హా... హా... ఒక్క చిన్న కుదుపు... హమ్మయ్య కదిలింది... ఓహోహో మార్గం పట్టింది. ఉరుకులు పరుగుల మీద దూకుతోంది.

ఏమయ్యా ఇదేం పోవడ ము లోపల ఉండేది మనుషులే కదా! రాళ్ళూ రప్పలూ కాదుకదా! ఇత్తడి స్టీలు సామాన్లు కాదు కదా! కుదిపిపారేస్తున్నావే. కదిపి పారేస్తున్నావే. ప్రాణాలతో ఆటలాడు తున్నావేమయ్యా. మనుషుల ప్రాణాలంటే ఎంత అలుసయ్యా మీ వ్యాపారస్తులకు. మీ వ్యాపారం మీకు సుఖంగా హాయిగా, తీయగా, సజావుగా,



సుఖంగా, లాభంగా ఉంటే చాలు. ఎవడెట్టా పోయినా మీకు సంబంధం లేదు.

అబ్బబ్బా... తల దిమ్మెక్కి పోయింది కదయ్యా. వాళ్ళంతా వహానవహౌతోందిగదయ్యా. ఎందుకంత సడన్‌గా బ్రేక్ వేశావు. కొంపలంటుకుపోతున్నట్టు. ఇంజన్నెందుకు అలా బొయ్యి బొయ్యిమని అరిపిస్తావు. తలబద్దలై పోతోంది. పోయే కాలమొస్తే అరుపులే అరుపులు. ఎవరి కోసం మళ్ళీ ఆ ఎదురు చూపు. ఎక్కడో ఇళ్ళల్లో ఉన్న వాళ్ళ కోసం కూడా ఎదురు చూపులేనా! ఇంక పదవయ్యా పెద్ద మనిషీ. ప్రతి వాళ్ళనూ చూసి ఎందుకంత చొంగ కారుస్తావు. ఇంకా ఎక్కడ కుక్కుతావు వాళ్ళని.

కిందపడ్డ ఆటో మళ్ళీ పరుగెడుతోంది. హాహాకారాలు మింటికెగిశాయి. ఆమె కన్నుల్లో కదలాడుతోంది. నా కోసం వేయి కళ్లతో నిరీక్షిస్తూ ఉంటుంది కాబోలు. ఇప్పటికి ఎంతో ఆలస్యమైపోయింది. ఆమె బాధ పడుతుందేమో! ఏమో వెళ్లాలి. ఇప్పటికైనా వెళ్ళాలి. త్వరగా త్వరత్వరగా ఎదురుగా లారీ వొస్తుందిరా బాబూ. కాస్త చూసుకొని నడుపు. కొద్దిగా పక్కకు పోవయ్యా బాబూ. దానికిందకేమన్నా తోస్తావా ఏమిటి?

అయ్యో మార్జిన్ దిగిందయ్యా. చక్రం వొరిగి పోతోందే! పడిపోతోందే!! అయ్యో అయ్యో పల్టీలు కొడుతోందయ్యా!! పిట్టల్లా రాలుతున్నారు జనం. పక్షుల్లా ఎగిరి కింద పడుతున్నారు. నాకేమైంది. ఏమౌతోంది? తల మీద నుండి చల్లగా కారుతోందేమిటి?

నేనామెను కలుసుకోవాలయ్యా! ఇవాళ కలవలేకపోతే ఇంకెప్పటికీ కలవలేను. నా మనసులో మాట మాటగానే మిగిలిపోయింది. ఒరే బాబూ నీకు పుణ్యముంటుందిరా. ఆ బరబరలేందిరా. ఆ చరచరలేందిరా. అయ్యో ఎవ్వరు చెప్పిన మాటా వినేటట్టు లేడు కదా! లోకం ఎవరికి వారే యమునా తీరే. పోనీలే నాయనా ఇప్పటికైనా కదిలించావ్. జూలు విదిలించావ్.

ఆమె మదిలో కదిలింది. కన్నుల్నిండా ఆమె రూపమే. ఆమె చూపుల్లోని అందమైన భావాలే. ఓహ్.... ఆమె ముంగురులు చేసే సవ్వడి సన్నసన్నగా వినిపించినట్లయింది.

చుట్టూ దృశ్యాలు ఒక దాని వెంట ఒకటి పరుగెత్తుకుంటూ పోతున్నాయి. లోపల అందరూ కాళ్ళూ చేతులూ మడతబెట్టి ట్రంకు పెట్టెలో పెట్టినట్టుగా ఒకరిపై ఒకరు పొర్లుతున్నట్టుగా దొర్లుతున్నట్టుగా వచ్చిన వాళ్ళందర్నీ 'పట్టుకోండి. ఆనుకోండి, వేలాడండి' అంటూ ఉత్సాహపరుస్తున్నాడు డ్రైవర్. అందరూ బిక్కుబిక్కుమంటూ మినుకు మినుకు మంటూ చూస్తున్నారు.

ఎవరి ఖర్మెలా కాలిందో! ఎవరి గాశారమెలా కాలిందో! అరేయ్ ఎవడ్రా వాడు ముందుకు నెడుతున్నాడు. మోకాలితో కుమ్ముతున్నాడు. అబ్బా నడుములు విరిగిపోతున్నాయి. ఓయ్ తొందరగా పోనియ్యవయ్యా బాబూ. అడుగడుక్కీ ఆపుతూనే ఉన్నావు. ఎక్కిన వాళ్ళు చాల్లేదంటయ్యా. గాల్లో వేళ్లాడే వాళ్ళు చాల్లేదంటయ్యా. టాప్ మీద కూడా కూర్చోబెడుతున్నావే. మా తలకాయల మీద కూడా కూర్చోబెట్టవయ్యా.

అయ్యో ఎంత ఆలస్యమైపోతోందో బాబ్బాబూ ఇవి చేతులనుకోవద్దు. కాళ్లనుకో. కాదూ కూడదంటే...నీ కాళ్ళు పట్టుకుంటానురా బాబూ. అసలు దీని కెపాసిటీ ఎంత బాబూ. ఎన్ని రెట్లు ఎక్కిచ్చావయ్యా. అయినా పోతూ ఉంటే కొమ్మల్లా రెమ్మలా వేలాడుతూనే ఉన్నారు. ఆటో అటూ ఇటూ ఊగుతోంది. ఏ చిన్న కుదుపువచ్చినా ఎగిరెగిరి పడుతోంది. అందరూ జాగ్రత్తగా గమ్యం చేరతారా! అడిగే నాథుడు లేకపోతే ఎప్పుడైనా ఇంతేనయ్యా. దోపిడీకి మితమేముంటది.

ఈ విధంగా నడుపుతుంటే ప్రయాణం మొదలు పెట్టిన వాళ్ళంతా నిజంగా గమ్యం చేరతారా! ఎక్కినప్పటి నుండీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొనే ఉన్నాం కదయ్యా. ఎలాగైనా నన్ను గమ్యం చేర్చవయ్యా. నీకు పుణ్యం ఉంటుంది. ఆమె కోసం, ఆమె మాటల కోసం వెన్నెల రాత్రే చేరుకోవాలి. జీవితాన్ని ప్రేమగా జీవించడం కోసం, ఆమె చెప్పే సమ్మోహనకరమైన మాటల కోసం ఆమెను చేరుకోవాలి. అందుకేనయ్యా పదవయ్యా బాబూ పద. ఇంకా ఆపుతూనే ఉన్నావు. ఎక్కుతూనే ఉన్నారు. ఇంకా ఎక్కడ సర్దుకోవాలయ్యా బాబూ. ఇప్పటికే చీమలు దోమలు కూడా దూరడానికి సందులేదు కదయ్యా. టాపు గూడా ఊగుతోంది. అయ్యో ఇప్పటికే ఎంతో ఆలస్యమైపోయింది. దూకి పారిపోవాలా!

మీ పబ్బం మీరు గడుపుకుంటే సరా. అరేయ్ మితముండాల్రా. ఆశకు అంతుండాల్రా బాబూ. వ్యాపారానికి సూత్రాల్లేవా బాబూ. ఇంకా చాల్లేదా! అంత తపనైతే ఎలాగ నాయనా. పదపద తొందరగా నన్ను గమ్యానికి చేర్చు. ఇంక దాహం తీర్చుకోవడం తగ్గించు. మమ్మల్ని గమ్యానికి చేర్చు.

మళ్ళీ వాడెవడో ఆపుతున్నాడు. ఆపేవాడికి బుద్ధి ఉండొద్దు. బుద్ధిలేని పుండాకోర్లారా. గాలి గుమ్మటంలా గిర్రున తిరుగుతూ వేలాడుతున్న వాళ్ళను చూశార్రా! ఇంకా చేతులెత్తి ఎందుకు ఆపుతార్రా. బుద్ధీ జ్ఞానం ఉండొద్దు. సూక్ష్మాంశాలన్నీ నశించిపోయాయా. మనిషిలో నరాలు తెగిపోయే ఉత్కంఠతలోనైనా లాభలవేట మానలేవు గదా! ఏం చెయ్యాలి? సమయానికి వర్షం కూడా పెద్దదైపోయింది. చినుకులు ఈడ్చి మొఖం మీద్కు కొడుతున్నాయ్.

వేళ్లాడుతున్న వాళ్ళంతా తడిసి గువ్వల్లా ముడుచుకుంటున్నారే కానీ, ఆగుతారేమో చూడు. దిగుతారేమో చూడు. ఆటో గుంటల్లో పడుతోంది. ఆకాశానికి లేస్తోంది. మళ్ళీ కింద పడుతోంది. రోడ్డు గుంటల మయమైనా ఆకాశం జోరున ఏడుస్తున్నా నీ స్పీడు నీదేనంటరా బాబూ!

ఎంతమంది ఎన్ని అనుకున్నా ఎవరెట్టా పోయినా నీ లాభం నీకొస్తుందిలే. ఎవరెట్టా పోతే నాకేమిటిలే అనేనా నువ్వు! చూడరా బాబూ చలికి ఎలా గజగజ వొణుకుతున్నారో! ఎక్కినప్పటి నుండీ దిగే దాకా ఇదే భయమా. అయినా ఏదో వెతుకులాట. ఆరాటం. ఎక్కుతున్నారు దిగుతున్నారు. ఆ జోరున కురిసే వర్షంలో లోపలా బయటా కుక్కుకొని తొక్కుకొని వేళ్లాడుతూ ఊగుతూ తూగుతూ ఆటో అటూ ఇటూ మెసుల్తూ కదులుతోంది.

ముందు ముందుకు గతుకుల్లో పడి బురద నీళ్ళు చిమ్ముతూ పైకి లేస్తుంది. చేరతానా. గమ్యం చేరతానా! ఏమో. ఇంకా స్పీడందుకుంది. అరే బాబూ అంత పెద్దరాయెక్కిందే. టైరు పైకి లేచిందే. ఆటో గాల్లోకి ఎగురుతోందే. పెద్ద కుదుపుతో మళ్ళీ నేలను తాకిందే.

కిందపడ్డ ఆటో మళ్ళీ పరుగెడుతోంది. హాహాకారాలు మింటికెగిశాయి. ఆమె కళ్లల్లో కదలాడుతోంది. నా కోసం వేయి కళ్లతో నిరీక్షిస్తూ ఉంటుంది కాబోలు. ఇప్పటికి ఎంతో ఆలస్యమైపోయింది. ఆమె బాధ పడుతుందేమో! ఏమో వెళ్లాలి. ఇప్పటికైనా వెళ్ళాలి. త్వరగా త్వరత్వరగా ఎదురుగా లారీ వస్తోందిరా బాబూ. కాస్త చూసుకొని నడుపు. కొద్దిగా పక్కకు పోవయ్యా బాబూ. దానికిందకేమన్నా తోస్తావా ఏమిటి?

అయ్యో మార్జిన్ దిగిందయ్యా. చక్రం వొరిగి పోతోందే! పడిపోతోందే!! అయ్యో అయ్యో పల్టీలు కొడుతోందయ్యా!! పిట్టల్లా రాలుతున్నారు జనం. పక్షుల్లా ఎగిరి కింద పడుతున్నారు. నాకేమైంది. ఏమౌతోంది? తల మీద నుండి చల్లగా కారుతోందేమిటి?

వర్షపు నీళ్ళేనా! ఎర్రగా చిక్కగా ఉందేమిటి? తల నిండా సూదులు గుచ్చుతున్నట్టు. అయ్యో కళ్ళు మూతలు పడుతున్నాయే. ఏమీ కనిపించడం లేదే అయ్యయ్యో!

ష్... ఆమె ఎలా ఎదురు చూస్తోందో! ఎవరు చెబుతారామెకు ఈ కబురు! ఈ త్రాష్టుడు... ఈ పుండాకోర్ ఎంత చెప్పినా విని చచ్చాడా. పోగాలం దాపురించిన వాడికి దాహం దాహం. ఒక్కొక్కరికి ఒక్కో దాహం. కన్నూ మిన్నూ కానకుండా చేస్తుందది. అంతులేని ఈ దాహం వల్ల ఎందరి ప్రాణాలు పోయాయో. ఎందుకు ఎక్కానురా ఈ మృత్యు శకటాన్ని. కళ్ళ ముందు నుండి ఒక్కొక్కటే అదృశ్యం కాసాగింది. లోకం అంతా చీకటి కమ్ముకుంటోంది. అయ్యో ఎవడో దాహానికి నేను బలైపోయానే. నా ఆశ అడియాశగా మారిపోయిందే!

❄

లోరి లోరిలో...

డా॥ జె.పి.వైద్య

బడుగు జీవుల కవితా ఘోష

శంకర్, జైకిషన్



కైఫీ ఆజ్మీ

మజరూహ్ సుల్తాన్ పురీ హిందీ సినీ దునియాలోని అద్భుతమైన కవి. ఓ.పి.నయ్యర్ హిందీ సినీ సంగీతాన్ని 'పంజాబీ ఠేకా' దరువులతో ఒక్క వూపు నిచ్చి 'హేమా హేమీ'ల సింహాసనాలను కదిలించిన అద్వితీయ సంగీతకారుడు.
ఆశా భోంస్లే 'నో సెకండ్ టు ఎనీ వన్'... న భూతో న భవిష్యత్ టైపు మత్తు గీతాల గాయనీ మణి - 'ఫిర్ వహ్ దిల్ లాయా హుఁ'లోని ఈ గీతం 'ఎవర్ గ్రీన్ సాంగ్' నేటికీ.... వచ్చే ఎన్నో తరాలకూడా!
'జియా బేకరార్‌హై.... భాయీ బహార్ హై
ఆజా మేరే బాలమా - తేరా ఇంతెజార్ హై'- హస్రత్ గీతం ఇది!



ఓ.పి. నయ్యర్



సాహిర్

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అనేది ఎంతటి వాస్తవం?
అది ఆకర్షణ మాత్రమే! ప్రేమ చిత్తశుద్ధి ఉన్న గుండెల్లోంచే జనిస్తుంది.
ఆ 'చిత్త శుద్ధి'కి పునాది ఆకర్షణ.

'ప్రేమ'... ఈ రెండక్షరాల కోసం రాజ్యాలు ధ్వంసమయ్యాయి. ఏకమయ్యాయి కూడా.

కవులు కలం ఝుళిపిస్తూ పుంఖాను పుంఖాలుగా రాసిపారేశారు.

రసికులు దోసిళ్ళ కొద్దీ దొరికినంత ఏరుకొని దాచుకున్నారు. సంగీతకారులు 'స-రి-గ-మ'లను కదిలించి అందమైన గీతాలను వందలు వేలకొద్దీ అందించారు.
మనం విని 'దీవానా గాళ్ళం' అయిపోయాం!

అటు 'బాలివుడ్'లోనూ- ఇటు 'టాలివుడ్'లోనూ ఎవ్వరూ ఎవ్వరినీ 'ఎక్కువ - తక్కువ' అనుకోకుండా - బాణీలను ఏరుకున్నారు. ఎత్తుకున్నారు. దోచుకున్నారు. దొంగిలించుకున్నారు.

కొందరు తెలివిగా 'దూర' దృష్టి సారించి 'తెల్లదొరలవో'-'ఆఫ్రికన్ నల్ల వాళ్ళవో' సంగీతం ధున్‌లు కాస్త 'దేశీయ రంగు'లో 'మేకప్' చేసి స్వంత బ్రాండ్ కింద పంపిణీ చేసి పారేశారు.

మంగళసూత్రం తప్ప మిగిలిన బంగారు ఆభరణాలు అన్నీ 'షోగ్గా' ధరించి, ధగధగా మెరిసిపోయే 'బాలివుడ్' భారీ సంగీతకారుడు యమస్పీడుగా ఫారెన్ సరుకులను 'దేశీయం' చేసిన ఘనాఘనుడు.

అలనాడు ఆ తరాన్ని ఆత్మీయంగా కదిలించి పారేసిన అద్భుతమైన గీతాలూ పాటలూ, షేర్ - ఓ-షాయరీ నేటికీ 'ఎవర్ గ్రీన్'గా నిలిచిపోయి ఉంది. ప్రేమ ఉద్భవించడానికి పాతిక సంఘటనలు, వంద ముచ్చట్లు అక్కర్లేదు. మనసు బీడు భూమి లాంటిది.

అక్కడో వర్షపు చుక్క తడుముతూ పడిపోతే చాలు మరి!

అది అప్పుడప్పుడు ఒక చిరునవ్వు... కొన్ని సార్లు ఆత్మీయంగా పలకరించే కనుచూపు... లేదా అందమైన ఝల్లుమనే స్పర్శ కూడా కావచ్చు.

ఆ ఒక్క సంఘటన కట్టలు తెంచుకొని ప్రవహించే 'ప్యార్ కా దరియా' అయిపోతుంది.

అప్పుడు చూపులూ, భాషా మారిపోతాయి. అప్పుడే
'తెరి ప్యారీ ప్యారీ సూరత్'లో -కిసీకి నజర్ నా లగే... చష్మే బద్దూర్'
అనే 'యాద్‌గార్ అమర గీతం' తయారవుతుంది.

'చౌదవీఁ కా చాంద్‌హో.. యా. ఆఫ్‌తాబ్‌హో. జో భీ హో తుమ్ ఖుదాకీ కసమ్ లా జవాబ్ హో' అని మురిపించే అందమైన గీతం ఆవిర్భవిస్తుంది మరి!

చెట్టునూ, పుట్టనూ, ఆకుల్నీ రెమ్మల్నీ ప్రేమించగలగాలి. వర్షాన్నీ , మంచునూ ప్రేమించగలగాలి. కవులు భావాలకు రంగులద్ది అందమైన కవితలు రచిస్తే సంగీత కారులు వాటిని ఇంపైన గీతాలుగా మలచి చిరస్మరణీయాలుగా రూపుదిద్దారు.

"ఆంఖో సె ఉతరీ హై దిల్ మే తస్వీర్ హై ఇన్ అన్జానే కీ
ఖుద్ ఢూంఢ్ రహీ హై షమ్మా జిసే- క్యా బాత్‌హై ఉస్ పర్వానే కీ'
(ముక్కూ మొహం తెలియని ఓ అపరచితుడి చిత్రాన్ని కళ్ళ నిండా నింపుకున్నా. అది కాస్తా గుండెలోనూ దిగిపోయి చిత్రీకరించి పోయింది. ఆ చిన్న రెక్కల చిమ్మెట పురుగుల్లో ఏముందని - దీపం అలా పిచ్చిగా వెదుకుతుంది...?)

మజరూహ్ సుల్తాన్ పురీ హిందీ సినీ దునియాలోని అద్భుతమైన కవి. ఓ.పి.నయ్యర్ హిందీ సినీ సంగీతాన్ని 'పంజాబీ ఠేకా' దరువులతో ఒక్క వూపు నిచ్చి 'హేమా హేమీ'ల సింహాసనాలను కదిలించిన అద్వితీయ సంగీతకారుడు.
ఆశా భోంస్లే 'నో సెకండ్ టు ఎనీ వన్'... న భూతో న భవిష్యత్ టైపు మత్తు గీతాల గాయనీ మణి - 'ఫిర్ వహ్ దిల్ లాయా హుఁ'లోని ఈ గీతం 'ఎవర్ గ్రీన్ సాంగ్' నేటికీ.... వచ్చే ఎన్నో తరాలకూడా!

'జియా బేకరార్‌హై.... భాయీ బహార్ హై
ఆజా మేరే బాలమా - తేరా ఇంతెజార్ హై'-
హస్రత్ గీతం ఇది!

మొట్ట మొదటి సారి మొత్తం దేశాన్ని ప్రకంపింపచేసిన 'ది గ్రేటెస్ట్ షో మాన్ ఆఫ్ ఇండియా' రాజకపూర్ చిత్రం 'బర్సాత్'.

శంకర్ జైకిషన్, హస్రత్‌తో పాటు

శైలేంద్ర కలం తొలిసారి సినీ రంగంలో విజయ బావుటాలు ఎగరేస్తూ వచ్చిన 'బర్సాత్'ను ఏ రసికుడూ మరచిపోలేదు.

'సౌ సాల్ పహలే ముఝే తుమ్ సే ప్యార్ థా
ఆజ్ భీ హై ఔర్ కల్ భీ రహేగాఁ'

(వంద సంవత్సరాల క్రితం నువ్వంటే నా కెంతో ప్రేమ....

అది నేడూ వుంది.... రేపు - అంటే తరతరాలుగానూ ఉండిపోతుంది అలాగే...)

అని హస్రత్ (జబ్ ప్యార్ కిసీసే హోతాహై) రాశాడు.

చిన్న చిన్న మాటల్లో జీవిత తత్వాన్ని అత్యంత మార్దవమూ, అద్భుతమైన గీతాల్లో మలచిన 'శైలేంద్ర' చిన్నవాడు కాదు. నిజంగానే గీతాల జాదూగర్.

'సబ్ కుఛ్ సీఖా హమ్నే -న సీఖీ హోషియారీ
సచ్ హై దునియావాలోఁ కే హమ్ హై అనాడీ'
(అన్నీ నేర్చుకున్నామయ్యా బాబూ...
తెలివితేటలైతే నేర్చుకోలే...!

ప్రపంచ మేధావుల్లారా... నిజమే! మేం దేనికీ కొరగాని అనాడి గాళ్లమే! తెలివి తక్కువ మూర్ఖులమే!) అని 'అనాడీ' కోసం రాశాడు.

'అనాడీ' రాజకపూర్, నూతనల సినిమా- దర్శకత్వం 'హృషికేష్ ముఖర్జీ' గారిది. ఎన్నో ప్రతిష్ఠాకరమైన అవార్డులు, రివార్డులు పొందిన 'శ్వేత - శ్యామ' చిత్రం అది.

వామపక్ష భావాలున్న కవుల్లో అగ్రగణ్యులు సాహిర్ లుధ్యానవీ, కైఫీ ఆజ్మీలు

'జానే వో కైసే లోగ్ థే జిన్ కే
ప్యార్ కో ప్యార్ మిలా.
హమ్నే తో జబ్ కలియాఁ మాంగీ
కాంటోఁకా హార్ మిలా'

(ఎలాంటి అదృష్టవంతులకో వాళ్ళ ప్రేమకు జవాబుగా ప్రేమ లభించింది. మేము మొగ్గలమై సరే... చాల్లే! అనుకున్నా - ముళ్ళ హారాలే లభించాయి)

లాంటి వేదనను గద్గదంగా పలికించిన భగ్న హృదయుడు 'సాహిర్'.

కైఫీ ఆజ్మీ - బాలివుడ్ ఆర్ట్ ఫిల్మ్ తార 'షబానా ఆజ్మీ' తండ్రి.

'ధీరే ధీరే మచల్
ఐ దిలే బేకరార్
కొయి ఆతాహై'

(కాస్త మెల్లగా సావధానంగా సంప్రదించవయ్యా అసంతృప్త 'గుండె' గారూ!
ఎవరో వస్తున్నారు!)

అని రసికత్వం పలికించే ఆయన కలం అవసరం వస్తే బడబాగ్నినీ విరజిమ్మేది.

హిందీలో హర్షదాయకం, స్ఫూర్తి దాయకం, రొమాంటిక్, హల్కా, పుల్కా ఇలా రక రకాలుగా రాసిన వాళ్ళున్నారు.

స్పందించడానికీ, ఆస్వాదించడానికీ మనలాంటి 'శ్రోతలూ'.... పాఠకులూ'... 'దర్దీ దీవానా గాళ్ళు' ఉన్నంత కాలం కవిత్వం, సంగీతం హోరుగా, జోరుగా చలాకీగా సాగిపోతూనే ఉంటుంది.

తళుకు బెళుకుల, నిరర్ధకమైన, గోల గోల రిమేక్స్‌లూ.... అర్థం పర్థం లేని మాటలు సోదీ... 'హు' ....హాఁ! '....'య్యాయ్యాయ్యా...' ఇది చూడు... అది చూడు. కావాలా? ఇస్తాను...లాంటివి ఎవరిని ఉద్ధరించడంకోసమో! మనమూ ఉత్సాహంగా రాయలేమా ఏమి?

"సేన్మ బోర్ కొట్టింది... అన్నా!
అవతలి కొచ్చి
సాహిత్యం కుండలో
దోసెడు అక్షరాల రాళ్లేసిన
కవిత్వం
పొర్లి పొంగింది...
చూస్కోండ్రి...చదువ్కోండ్రి.....
డింగ్ డింగ్ డింగ్!!

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్: 08732223622











నా భూమి నాకు దక్కేదెలా!

నేను 1968వ సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసి సిపాయి పెన్షన్ పొందుతున్నాను. వయస్సు 77 సంవత్సరాలు. 1983వ సంవత్సరంలో 365 గజాల స్థలం కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. ఆ స్థలము పక్కనున్న గ్రామ పరిధిలో వున్నది కనుక ఏ విధమైన వసతులు లేవు. ఆ స్థలాల్లో కొంత మంది గుడిసెవాసులు ఉంటుండేవారు. కొంత కాలం వరకు వాళ్ళే వున్నారు. నేను అనారోగ్య కారణాల వల్ల అటువైపు వెళ్ళలేదు. ప్రస్తుతం ఆ స్థలాలు కార్పొరేషన్ పరిధిలోకి చేరిపోయాయి. ఆ గుడిసెవాసులు లేరు. స్థలాలు వేరే వారు ఆక్రమించుకొని వసతులు కల్పించుకొన్నారు. ఖాళీ చెయ్యటానికి నిరాకరిస్తున్నారు. మేము పన్ను కడుతున్నాం. స్థలం మాదే అంటున్నారు. నేనైతే ఇంత వరకు ఎటువంటి పన్నులు చెల్లించలేదు. కారణం వేరేవాళ్ళు వుంటున్నారని. అసలు 1. పన్నులు చెల్లించనంత మాత్రాన ఇతరుల స్థలాలు అవుతాయా? 2. ఆ స్థలం నాకు చెందాలంటే నేను ఏమి చేయాలి? 3. మాజీ సైనికుల ఆస్తులు ఆక్రమణలకు గురైతే వారికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందా? 4.జిల్లా కలెక్టర్‌ను గాని, పోలీసు అధికారులను గాని ఆశ్రయించమని కొంత మంది చెప్తున్నారు. పరిష్కార మార్గం తెలుపగలరు?

కె.వి.ఎస్. రావు, గుంటూరు.

మీరు కొన్న భూమిని సరైన దృష్టిపెట్టి కనిపెట్టుకోలేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఆక్రమణదారులు ఈ పాటికి తమకు అనుకూలంగా పన్ను రశీదులే కాకుండా.... ఇంకేమైనా రిజిస్ట్రేషన్ దస్తావేజులు కూడా పెట్టించు కోగలిగి ఉంటారు.

వారు పన్నులు చెల్లిస్తూ ఏదైనా పత్రాలు పుట్టించుకొని, బహుశా రెండు దశబ్దాల నుండి ఉంటున్నారు. కావున వారు 'అడ్వెర్స్ పొజిషన్' ఇప్పించుకోవడానికి చూస్తారు. మీకు మిగిలిన మార్గం ఒక్కటే. సివిల్ దావా వేసి వారి నుండి పొజిషన్ తీసుకొని డిక్లరేషన్ నిరూపించుకోవలసి ఉంటుంది.

మాజీ సైనికులకు ప్రభుత్వం వారు ఇచ్చిన భూమి అయితే అది అన్యాక్రాంతమయితే ప్రభుత్వం వారు ఏమైనా చర్యలు తీసుకోగలిగేవారు. కాని, ఇది మీకు సంబంధించిన స్వంత కొనుగోలు కావున ప్రభుత్వం, పోలీసులు సివిల్ కోర్టుకెళ్లమనే చెబుతారు.

పోలీసువారిని ఆశ్రయించండి. వారి మీద అవకాశం ఉంటే దురాక్రమణ కేసు పెట్టవచ్చు. సివిల్ దావాకు ఇది ఒక ఆధారంలా ఉంటుంది.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్.

నా వాటా రావాలంటే...

ఇది అన్నదమ్ముల ఆస్తి విషయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నాం. కానీ మాది చిత్తూరు జిల్లా పాకాల. మా ఆస్తులు మా అన్నదమ్ములిద్దరి పేర వున్నాయి. మా అమ్మానాన్నాలు స్వర్గస్తులయ్యారు. మా అన్నగారు నాకు ఆస్తిలో భాగం ఇవ్వలేదు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. ఇప్పుడు మా నాన్న ఆస్తి మాత్రం బాండు పేపరు మీద భాగాలుగా రాసుకున్నారు. కాని రిజిష్టరు చేయించుకోలేదు. ఇప్పుడు మేము రాసుకున్న పత్రాలు చెల్లుతాయా!

మా మేనత్తగారి ఆస్తికి సంబంధించి...భర్త చనిపోయారు. ఆమెకు పిల్లలు లేరు. మేనల్లుళ్లమైన మా సంరక్షణలో ఉంటూ ఆమె చనిపోయారు. ఆమె ఆస్తిని మా ఇద్దరి పేర పాకాల సబ్ రిజిష్టర్ ఆఫీసు నందు రిజిష్టరు చేశారు. అయితే మా అన్న పిత్రార్జితం ఆస్తిలో మాత్రమే సగ భాగం ఇస్తానని, మిగతా ఆస్తి ఏమి ఇవ్వనని అన్నాడు. మా నాన్నగారి ఆస్తి కన్న అత్తగారి ఆస్తి ఎక్కువగా ఉంది. రాజీ జరగలేదు. మేము ఇద్దరం ఆస్తి పంచుకోలేదు. మా నాన్న గారి ఆస్తిలో సగభాగంతో నన్ను పక్కకుపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. మా అత్త ఆస్తితో నాకు సంబంధం లేకుండా రిజిష్టరు ఆఫీసులో కనపరుస్తా అన్నారు. ఇందుకు నేను అంగీకరించలేదు. ఇన్ని సంవత్సరాల ఆదాయం అతని ఆధీనంలోనే ఉన్నది. ఇప్పటి వరకు మా అత్తగారి ఆస్తి ఇవ్వలేదు. సలహా ఇవ్వగలరు.

ఎస్.డి. బాబు, హైదరాబాద్.

మీకు మీ అన్నగారు తండ్రి ఆస్తిలో సగభాగం ఇస్తానన్నారు. కావున దాంట్లో మీరు చింతించవలసిన పని లేదు. మీ మేనత్తగారి ఆస్తి, ఆమెకు వారసులు ఎవరూ లేనట్లయితే, ఆమె ఎటువంటి విల్లు రాయనట్లయితే అది మీ (అన్నగారి) లేక మీ సమిష్టి ఆధీనంలో ఉన్నది. కావున ఆవిడకు మీరు కూడా మీ అన్నగారితో పాటు సేవలందించివుంటే, మీరు ఆవిడ ఆస్తిలో హక్కుదారే. మీ అన్నగారితో రాజీ కుదరక పోతే మొత్తం ఆస్తిపై భాగ పంపిణీ దావా వేయండి. మీ పరిధి ఏ కోర్టు పరిధిలోకి వస్తుందో అదే న్యాయస్థానంలో దావా వేయవలసి ఉంటుంది. ఫల ఆదాయం కూడా లెక్కగట్టి మీరు దావాలో అడగవచ్చు.



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టున్యాయవాది, 9848994240

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

నామీద నాకే అసహ్యం వేస్తోంది

నా వయస్సు 18 సంవత్సరాలు. మా కాలేజీలోనే చదువుతున్న దబ్బున్న యువకుడిని ప్రేమించాను. అతని వల్ల దురలవాట్లకు బానిసయ్యాను. ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు బాగా అలవాటయ్యాయి. పైగా శారీరక సంబంధం కూడా వుంది. అంతా జరిగిన తర్వాత నన్ను దూరం చేసుకుంటున్నాడు. ఇలా జరిగినందుకు నా మీద నాకే అసహ్యం వేస్తోంది. మానసికంగా కుంగిపోయాను. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి మార్గం చెప్పండి.

సంధ్య, నెల్లూరు.

యువతీయువకుల్లో ఆకర్షణ వల్ల ప్రేమ అంటూ కలిసి తిరిగి ఒకరి అలవాట్లు మరొకరు అలవరచుకుంటారు. ఇదొక ఫ్యాషన్‌గా భావిస్తారు. చివరికి దురలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటారు. ఇప్పడు చెయ్యాల్సినదేమిటంటే వేరే ప్రదేశంలో కొత్త జీవితాన్ని ప్రారంభించు. కొత్త కాలేజీలో చేరి క్రమక్రమంగా దురల వాట్లకు దూరం కావడానికి ప్రయత్నించు. వైద్య నిపుణుల్ని సంప్రదించు. వారు కౌన్సిలింగ్ చేస్తారు. అవసరమైతే మందుల ద్వారానైనా చికిత్స చేసి నయంచేస్తారు.

అంతా గజిబిజి



అసలు కన్ఫ్యూజన్ అంటే ఏమిటి? కన్ఫ్యూజ్ అయ్యే విషయాలన్నీ తెలుసుకొని మాత్రమే చదవాలా? లేక తెలుసుకోకుండా చదివినా అవే తొలగిపోతాయా? అనే అనుమానం ఉంది. ఖచ్చితంగా కన్ఫ్యూజ్ అయ్యేవి తెలుసుకొని చదవాలంటే కొన్ని ఉదాహరణలు ఇవ్వండి. అసలు కన్ఫ్యూజ్ అయ్యే విషయాలను తెలియజేయగలరు.

మమత, కాకినాడ.

ఒక విషయం అనేక విషయాలను పోలి ఉండడం మూలంగా వ్యత్యాసాలు గుర్తించలేని విషయాన్ని (కన్ఫ్యూజ్) సందిగ్ధత అంటారు. ఉదాహరణకు రాము, సోము కవలలు. ఎవరు సోము అని గుర్తించకపోవడమే కన్ఫ్యూజన్. చిన్నప్పటి నుంచి నేర్చుకోవడంలో సరైన శిక్షణ లేకపోవటం వల్ల, తల్లిదండ్రుల వల్ల, స్కూలు వల్ల సందిగ్ధత ఏర్పడుతుంది. ఒక విషయంపై కన్ఫ్యూజన్ ఉంటే టెన్షన్ ఏర్పడుతుంది. ఆ టెన్షన్, ఎంగ్జయిటీకి గురిచేస్తుంది. అది యాంగ్జయిటీ న్యూరోసిస్‌గా మారుతుంది. విషయాలపై కమాండ్ లేనప్పడు కూడా సందిగ్ధత ఏర్పడుతుంది. ఏ విషయాలపైనైనా సంపూర్ణ అవగాహన అవసరం. నువ్వు చదివే విషయాలను అర్థం చేసుకొని చదవటం వల్ల పరీక్షలలో చక్కగా రాయగల్గుతావు. ఒక విషయంపై అవగాహన ఏర్పర్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది. తద్వారా జ్ఞాపకశక్తిని మెరుగు పర్చుకోగల్గుతారు. మీరు నేర్చుకోవాలన్న తపనను పెంపొందించుకోవటం ద్వారా మిమ్మల్ని గొప్ప వ్యక్తిగా మార్చుకోగల్గుతారు.

మంచి స్థితికి చేరుకోవాలంటే...

మాది మధ్య తరగతి కుటుంబం. నన్ను చదివించే స్తోమత మా కుటుంబానికి లేదు. నా శక్తికి మించి సమస్యలు రావడం ద్వారా మద్యానికి బానిస అయ్యాను. అయితే నాకు చదువు అంటే ఇష్టం. నేను చదవింది కరెక్టుగా 7వ తరగతి వరకే. నాలుగు సంవత్సరాల తరువాత 10వ తరగతి ప్రయివేటుగా ఫీజు కట్టి పరీక్షలు రాశాను. ఒక్క ఇంగ్లీషు తప్ప అన్నీ పాసయ్యాను. చేతిపని నేర్చుకొని ఒక చిన్న కంపెనీలో పని చేస్తున్నాను. నా స్నేహితుడు బంధువుల్లో నాకన్న చిన్నవారు మంచి పొజిషన్‌లో ఉన్నారు. నాకు మాత్రం కనీసం డిగ్రీ వరకు చదవాలని అనిపిస్తుంది. కాని ఏకాగ్రత కలగటం లేదు. నాకు ఇంగ్లీషు నేర్చుకోవాలని ఉంది. కాని తెలుగు సరిగ్గా రాదు. ఇక నేర్చుకుంటాననే నమ్మకం కుదరలేదు. కనీసం నా స్థాయికి తగ్గ గమ్యాన్ని ఎన్నుకొని పట్టుదలతో కృషి చేస్తున్నా సంవత్సరాలు గడుస్తున్నా స్థిరపడలేకపోతున్నాను. ఏం చేయాలో దయచేసి తెలియజేయగలరు?

ఆంజనేయులు, రాజమండ్రి.

విజేతగా ఎవరూ పుట్టరు. సాధనతోనే విజేతగా మారతారు. మీరు సమస్యలున్నాయని మద్యానికి బానిసయ్యానని అన్నారు. మందు తాగటం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. నరాల బలహీనత ఏర్పడుతుంది. అనుకున్న పని ఏదీ చేయలేరు. ముందు మీరు మద్యం మానుకోవడం కోసం సైకియాట్రిస్ట్‌ను కలవండి. ఒక గొప్ప ఆలోచన కన్నా ఒక చిన్న కార్య సాధన మేలైంది. మీరు ఒక చిన్న పనిని చేయడం మొదలు పెట్టండి. విజయాన్ని సాధించడం అనే కార్యక్రమానికి ఒక చక్కటి ప్రారంభాన్ని ఇవ్వండి. మీలోని నెగటివ్ థింకింగ్‌కి స్వస్తి చెపుతూ మీరు మీ మైండ్ కారుకి పాజిటివ్ గేర్ వెయ్యండి. రిమోట్‌తో ఆపరేట్ చేయబడిన రోబోలా మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. ప్రతి రోజు ఒక అరగంట ఇంగ్లీషు, తెలుగు చదవటం, రాయటం, వినడం చేయండి. అలా చేయటం వల్ల మీరు కొంత కాలానికి అందరికన్నా ఇంగ్లీషు బాగా మాట్లాగడలరు. మీ మానసిక స్థితి

పూర్తిగా మీ అదుపులో వుండటం మీ లక్ష్యసాధనకు చాలా అవసరం. మీ ఆలోచనలు ఉద్వేగాలు మిమ్మల్ని శాసించకుండా మీరే వాటిని నియంత్రించండి. మీకు అనుకూలంగా వాటిని రూపొందించుకోండి. నేర్చుకోవాలన్న తపన, ప్రయత్నమే మిమ్మల్ని ఎదగడానికి ప్రోత్సహిస్తాయి. బ్రీదింగ్ ఎక్సర్‌సైజులు, యోగా, మెడిటేషన్, సైకోథెరపీ మీకు ఉపయోగపడతాయి. మీ పాజిటివ్ ఆలోచనలే మిమ్మల్ని ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతాయి.

కథా నిలయం
ENTERED

జీవనగీతం

జీవన్
వెల:35/-, పేజీలు:64
ప్రతులకు: జీవన్
ప్రతిభా కుటీరం, 4-1-19,
రోటరీ నగర్,
ఖమ్మం-507 002

స్వీకారం

మార్క్సిజం అంటే ఏమిటి?

వెల: 15/-,
పేజీలు: 54
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్‌బజార్,
హైదరాబాద్.



హత్తుకుపోయే కథలు



కథలు చాలా మంది రాస్తారు. సమాజంలోని బడుగు జీవుల గురించి, కనుమరుగవుతున్న చిన్న చిన్న సమూహాలు-వృత్తుల గురించి రాసేది ఎందరు?! ఒకవేళ రాసినా వారి బతుకు పోరాటాన్ని, వృత్తి సమస్యలను, వారి భాషను, యాసను, భావాలను, గుండె ఘోషను కళ్లకు కట్టినట్టు రాసేదెందరు? రాయలసీమ కథకుడు రాసాని కథల్లో అవన్నీ సజీవంగా దర్శనమిస్తాయి. గ్రామాలలో తృణీకరించబడ్డ కులస్థుల పట్ల ఆయనకున్న ఆవేదన గుండెల్ని పిండుతుంది. పైగా రాసాని ప్రకృతి ప్రేమికుడు. ఏ చెట్టునైనా, ఏ పిచ్చి వేరునైనా పేరుతో పిలవగలడు. పుట్టల్లో ఉసుళ్లు, తాడిచెట్టు నెగబాకే ఉడతలు, బొర్రెల్లో దాగిన మూషికాలు, పాము తోళ్లు, కప్ప కాళ్లు, ఈదే చేపలు, పదునుకొచ్చిన ఈతపళ్లు...వాటి భాషను మాట్లాడగల అనాది సంచార జాతులు ఆయన కథావస్తువులు. అడవి జీవుల అంతరంగాన్ని అలవాట్లను అత్యంత సహజత్వంతో వర్ణించగలడు. అటువంటి రచయిత రాసాని రెండవ కథల సంపుటం ఈ 'పయనం'. ఇందులో మొత్తం 17 కథలున్నాయి. 'ఇరసాల మిట్ట', 'తాలు గింజలు', 'పాలగొడ్డు' కథల్లో... అత్యంత వేగంగా తారుమారవుతున్న ఆంధ్రదేశ గ్రామీణ జీవన పద్ధతులు దర్శనమిస్తాయి. అడవిలో ఎక్కడ నీళ్లుంటే అక్కడ గుడారాలేసుకొని చిన్నాచితకా జంతువుల్ని వేటాడి తింటూ, ఆ ప్రాంతంలో వున్న పల్లెల్లో పిన్నీసులు, తల పిన్నులు, పూసల దండలు అమ్మి, ఆ డబ్బుతో కాసిని నూకలు తెచ్చుకుని బతికే సంచార జీవులు నక్కలోళ్లు. 'పయనం' కథ వీరి గురించినదే. కొందరు నక్కలోళ్లు అడవిలో గుడారాలు వేసుకుని జీవిస్తుంటారు. ఓసారి వాళ్లు ఆహారం కోసం చిన్న చిన్న జంతువులను వేటాడేందుకు అడవిలోకి వెళతారు. పుల్లలకోసం అడవిలోకి వచ్చిన గ్రామస్థులను ఫారెస్టు అధికారులు చూసి తరిమికొడుతుంటారు. ఆ గొడవ విని అటుగా వెళ్లిన నక్కలోళ్లను చూసిన పోలీసులు వారి దగ్గర తుపా కులేమైనా వుంటే ఇచ్చేయ మంటారు. పైగా వారి వల్లే నక్కలు, తోడేళ్లు, కుందేళ్లు అయిపులేకుండా పోతున్నాయని పై ఆఫీసర్లు తిడుతున్నారంటారు. ఇంక అడవుల్లో కనిపిస్తే నక్సలైట్లని చెప్పి కాల్చిపారేస్తామని గుడారాలు పీకి పారేస్తారు. సామానంతా చిందర వందర చేసేస్తారు. ఏడుపులు పెడబొబ్బలు పెడుతూ ఆ సామాన్లన్నీ సంచుల్లోకి సర్దుకుని బయలుదేరతారు. మనసు కకావికలమైన నాగప్ప మాత్రం ఆలోచిస్తూనే వుంటాడు 'అడవుల్లో జంతువులు నాశనమైపోతున్నాయని తరిమేస్తున్నారేగానీ, అడవులపైన బడి బతికే మా బతుకులు ఏమైపోతాయోనన్న యోచన ఒకనికీ లే. జంతువులకంటే కనాకష్టమై పోయిందాది మా బతుకులు' అనుకుంటాడు మనసులో. అలా గమ్యం తెలీని వారి పయనం ముందుకు సాగుతూనే వుంటుంది. ఇది చదివిన వారికెవరికైనా నక్కలోళ్ల పరిస్థితి ఏంటో, వారి జీవనం ఎంత కష్టంగా తయారైందో, వారి పట్ల ప్రభుత్వాల వైఖరి ఏంటో అర్థమౌతుంది. గ్రామ పెద్దల మధ్య వున్న గొడవలకు, మాట పట్టింపులకు, అధికారం కోసం జరిగే పోరుకు కాయకష్టం చేసుకునే బొజ్జన్నలాంటి వాళ్లు ఎలా బలిపశువులు అవుతారో తెపుతుంది 'కొలిమి' కథ. 'చేతబడి' వంటి మూఢనమ్మకాలకు అమాయక జీవితాలు ఎలా బలవుతున్నాయో చెప్తుంది. 'తీర్పు' కథ. అమ్మానాన్న, అన్నావదినలు చనిపోతే తోడబుట్టినవాళ్లను ...అన్న కన్నబిడ్డలను సొంత బిడ్డలుగా పెంచి పోషించి ఒక స్థితికి తీసుకొస్తుంది జానకి. అందుకోసం అన్నిటికీ దూరమవుతుంది. తన వారి గురించే ఆలోచిస్తుంది. అయితే శక్తి అంతా వుడిగి పోయి వృద్ధాప్యం పైబడే సరికి తన వారందరూ అసహ్యించు కోవడాన్ని అడ్డమవడాన్ని 'సాలె గూడు' లో కంటతడి పెట్టిం చేలా వర్ణించారు రాసాని. ఇలా ప్రతి కథా మనసుకి హత్తుకుపోతుంది. పాషాణ హృదయులైన పాఠకులను కూడా కంట తడి పెట్టిస్తుంది.

పయనం
కథల సంపుటి
డా॥ వి.ఆర్.రాసాని
వెల:60/-, పేజీలు: 136
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్.

- కొమ్మాలపాటి అల



QUOTATIONS & PROVERBS

COMPILED & EDITED BY:
P. REJESWARA RAO

వెల: 35/-, పేజీలు:127
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్‌బజార్,
హైదరాబాద్.

స్వీకారం

దళిత సమస్య

భవిష్యత్తు దిశగా

డి. రాజా
వెల:12/-, పేజీలు: 69
ప్రతులకు: జీవా
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్‌బజార్,
హైదరాబాద్.





పాలరాతి పిల్లలు

మనం ఇప్పటివరకు ఎన్నో కళాఖండాలను చూసివుంటాం. అందులో జంతువులు, మనుషులు, చెట్లు, లతలు, తీగలు, పూలు...వుండివుంటాయి. కానీ...గర్భస్థ శిశువులను శిల్పాలుగా చెక్కడం ఎక్కడైనా చూశారా! అది మార్క్ క్విన్‌కే సాధ్యమైంది. తల్లి గర్భంలోపల జీవం పోసుకున్న బిడ్డ పలు దశల్లో ఎలా వుంటుందో లేతగులాబిరంగు పాలరాతిపై చెక్కి చూపించారు. అంతేకాకుండా వాటిని 'ఎవల్యూషన్' పేరుతో ట్రఫాల్గర్ స్క్వేర్‌లో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 22 వరకు ఈ ఎగ్జిబిషన్ నడుస్తుంది.



ఫొటోలు తీసే పిల్లి

ఎక్కడైనా పిల్లులు ఫొటోలు తీయడం చూశారా! పోనీ విన్నారా? లేదా! అసలు ఇంతవరకు అలాంటి ఆలోచనే రాలేదా? ఇలాగైతే ఎలాగండీ బాబూ! అప్పుడప్పుడు అలా కూడా ఆలోచించాల్సి వుంటుందని...ఇదిగో మీ ముందున్న మార్జాలాన్ని చూస్తే అర్థమౌతుంది. తన యజమానురాలితో కలిసి దర్జాగా ఫొటోకు పోజిచ్చిన ఈ పిల్లే ఫొటోలు తీసేది. ఈ మూడు ఫొటోలను అదే తీసింది.

ఎలా సాధ్యం? అనుకుంటున్నారా! మనసుంటే మార్గాలకేం కొదవ. కాకపోతే ఇక్కడ ఈ మార్జాలం యజమానురాలిని అభినందించాలి. జర్మనీకి చెందిన ఆవిడ ఈ పిల్లి మెడలో ఒక కాంపాక్ట్ కెమెరాను వేళ్లాడదీశారు. ఇది ప్రతి 15 సెకన్లకొకసారి క్లిక్ మనిపిస్తుంటుంది. అలా మన పిల్లిగారు ఎక్కడికెళితే అక్కడ కెమెరా క్లిక్ మంది. ఆ ఫొటోలే మీరు చూస్తున్నది. ఏమైతేనేం పిల్లి తీసిన ఫొటోలు బాగున్నాయా లేదా!



ENTERED

తోడేలు ఏడు మేకపిల్లలు

సాహిల్

ఒక మేకకు ఏడు పిల్లలు. చాలా ముద్దుగా వుంటాయి. అవంటే తల్లికి చాలా ప్రేమ. కడుపు నిండా తిండి పెట్టి వాటితో ఆడుకోవడమంటే దానికి మహా ఇష్టం. ఓసారి మేత కోసం అడవిలోకి వెళ్లాల్సి వచ్చింది. కానీ ఇంతవరకు తన పిల్లలను వదిలి ఎప్పుడూ అంత దూరం వెళ్లలేదు. కానీ వెళ్లక తప్పదు.

"అసలే చిన్న పిల్లలుకదా. తిండి తినకుండా ఎక్కువసేపు వుండలేవు. నీరసపడిపోతాయి" అనుకుంది మనసులో.

ఇంతలోనే పొరుగున వుండే తోడేలు గుర్తొచ్చింది దానికి. 'అమ్మో! ఆ తోడేలుకు దయ జాలి అన్న పదాలకు అర్థాలే తెలియవు. దాని పక్కన ఈ పసికూనలను వంటరిగా వదిలివెళ్లడమా! కుదరనే కుదరదు' అనుకుంది గట్టిగా. ఇంతలోనే పసికూనల ఆకలి గుర్తొచ్చి...

'అమ్మో! ఆ తోడేలు రాక్షసి వస్తుందని భయపడి నా పిల్లలకు కడుపునిండా తిండి పెట్టకుండా మాడ్చుతానా! ఇది నా కంఠంలో ప్రాణం వుండగా జరిగే పనికాదు.. ఏదేమైనా సరే! నేను అడవికి వెళ్లాల్సిందే. మంచి ఆహారం తెచ్చి పెట్టాల్సిందే. కాకపోతే అడవికి వెళ్లేటప్పుడు వాటికి తోడేలు ఎంత భయంకరమైనదో, అది తమలాంటి చిన్న చిన్న ప్రాణులను ఎంత ఇష్టంగా తింటుందో అంతా చెప్పాలి. జాగ్రత్తగా వుండమనాలి" అనుకుంది.

వెంటనే తన చిన్నారులను దగ్గరకు పిలిచింది ప్రేమగా. అన్నిటినీ ఎంతో ఆప్యాయంగా దగ్గర కూర్చోబెట్టుకొని మురిసిపోతూ...'చూడండి పిల్లలూ! నేను ఇంట్లో లేనప్పుడు మీరు జాగ్రత్తగా వుండాలి. ఎవరైనా వచ్చి తలుపుకొట్టినా గబాల్న తీయకూడదు. వారెవరో ...ఏంటో పూర్తిగా తెలుసుకొన్నాకే...గడియతీయాలి. అసలు ఆ అవసరం కూడా లేదు. మా అమ్మ లేదని చెప్పి పంపేయండి. ముఖ్యంగా పొరుగున వుండే తోడేలుకు ఎప్పటినుంచో మిమ్మల్ని తినాలని కోరికగా వుంది. నేను మిమ్మల్ని వదిలిపెట్టి ఎప్పుడెప్పుడు బయటకెళతానా అని కాచుకొని వుంది. అందుకని మీరు చాలా తెలివిగా మెలగాలి. సరేనా! నేను బయటికెళ్లగానే లోపల గడియ వేసుకోండి. అంతా ఒక చోటే కూర్చుని కథలు చెప్పుకోండి. పాటలు పాడుకోండి. డాన్స్ చేయండి. అంతేకానీ బయటకు మాత్రం రాకండే. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే...ఆ తోడేలు మహా జిత్తులమారిది. రకరకాల వేషాలు వేస్తుంది. గొంతులు కూడా మార్చగలదు. అందుకే మీరు మరింత తెలివిగా వ్యవహరించాలిసుమా" అంటూ పిల్లలకు మరీ మరీ జాగ్రత్తలు చెప్పి అడవిలోకి వెళ్లడానికి సిద్ధమైంది.

పిల్లలు తెలిసిందన్నట్టు తలాడిస్తూ..."అమ్మా! మేం చాలా తెలివిగలవాళ్లం. జాగ్రత్తగా వుంటాం. నువ్వు నిశ్చింతగా అడవికి వెళ్లిరా" అన్నాయి.

అప్పుడు తల్లిమేక ఎటువంటి దిగులూ లేకుండా బుట్ట తీసుకొని అడవి బాట పట్టింది.

❂ ❂ ❂

పొరుగున వుండే తోడేలు కిటికీలోంచి ఇదంతా చూడనే చూచింది. ఇంకేముంది! లొట్టలు వేసుకుంటూ ఆ ఏడు లేత మేకపిల్లలను తినేసినట్టే ఊహించుకుంది. చక్కటి కథ అల్లి మేకపిల్లలను బయటకు రప్పించి తినేయాలనుకుంది. వెంటనే చప్పుడు కాకుండా అడుగులో అడుగు వేసుకుంటూ మేకపిల్లల ఇంటికి చేరింది. కానీ అప్పుడే తలుపు కొడితే మేకపిల్లలకు అనుమానం వస్తుందనుకొని ... అరుగు మీద కూర్చుంది.

కాసేపయ్యాక... మెల్లగా తలుపుకొట్టి "పిల్లలూ! నేను మీ అమ్మను! ఇంటికి వచ్చేశాను. తలుపు తియ్యండి" అంది.

కానీ మేకపిల్లలకు ఎందుకో అనుమానం వచ్చింది. అమ్మ గొంతు అలా గరుకుగా వుండదే అనుకొని "ఇదిగో నువ్వు మా అమ్మవు కావు. మా అమ్మ గొంతు చాలా బావుంటుంది. ఇలా గరుకుగా వుండదు. నువ్వెవరోగానీ పో ...మేం తలుపు తియ్యం' అన్నాయి.

అమ్మ మేకపిల్లలూ! బాగా తెలివిగలవాళ్లలాగా వున్నారే అనుకొని గొంతు సవరించుకొని "పిల్లలూ! నేను మీ అమ్మను! ఇంటికి వచ్చేశాను. తలుపు తియ్యండి" అంది.

మేకపిల్లలకు ఆ గొంతు అమ్మదిలాగే వున్నా...ఎందుకో అనుమానం వచ్చింది "ఏది నీ కాళ్లు చూపించు" అన్నాయి. తలుపు సందుల్లోంచి తోడేలు పాదాలు చూచి "నువ్వు మా అమ్మవు కావు. మా అమ్మ పాదాలు చాలా సున్నితంగా , తెల్లగా వుంటాయి.నీవి మొరటుగా, నల్లగా వున్నాయి. వెళ్లిపో" అన్నాయి.

ఇక ఏంచేయాలో తోచలేదు తోడేలుకు. అలా నడుచుకుంటూ వెళుతుండగా శెట్టి కొట్టు గుర్తొచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లి కాస్త వరిపిండి అడిగితెచ్చుకుంది. మేకపిల్లల ఇంటి ముందు... ఆ పిండిని చేతులకు, పాదాలకు పూసుకొని "పిల్లలూ! నేను మీ అమ్మను! ఇంటికి వచ్చేశాను. తలుపు తియ్యండి" అంది.

మేకపిల్లలు చేతులు, పాదాలు చూపించమన్నాయి. తోడేలు చూపించింది. తెల్లగా వున్నాయి. అమ్మే వచ్చిందనుకున్న మేకపిల్లలు అమాయకంగా తలుపు తీశాయి. అంతే...తోడేలు పెద్దగా నవ్వుతూ ఇంట్లోకి రావడం రావడమే తలుపు గడి వేసేసింది. దాన్ని చూడగానే మేకపిల్లలకు తాము మోసపోయామని అర్థమైంది. ఏడుస్తూ... తలా ఒక మూలకు పరుగు తీశాయి.

(తర్వాత ఏం జరిగింది! తోడేలు మేకపిల్లలను తినేసిందా! లేక మేకపిల్లలు తప్పించుకున్నాయా?! వంటి ఆసక్తికరమైన విషయాలు తెలియాలంటే... ఇంకా ఏడు రోజులు వేచి వుండాల్సిందే)